


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 179 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : చిత్తూరు శుక్రవారం 10 జూలై 2026 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE :179 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : CHITTOOR FRI 10 JULY 2026 PRICE : 5/- RS

Simultaneously Published form Chittoor,Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur

## హెచ్ఐవీ కట్టడికి కొత్త వ్యాక్సిన్... ప్రయోగాల్లో అద్భుత ఫలితాలు!

- హెచ్ఐవీ వ్యాక్సిన్ అభివృద్ధిలో కీలక ముందడుగు
- జంతువులపై జరిపిన ప్రయోగాల్లో అద్భుత ఫలితాలు
- వైరస్‌ను ఎదుర్కొనే శక్తివంతమైన యాంటీబాడీల ఉత్పత్తి
- మనుషులపై క్లినికల్ ట్రయల్స్ దశకు చేరుకున్న పరిశోధనలు

పెన్ పవర్ డెస్క్: హెచ్ఐవీ/ఎయిడ్స్ నివారణలో దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న వ్యాక్సిన్ దిశగా శాస్త్రవేత్తలు కీలక పురోగతి సాధించారు. ప్రయోగాత్మకంగా అభివృద్ధి చేసిన ఒక కొత్త వ్యాక్సిన్, కోతుల వంటి ప్రైమేట్లపై జరిపిన పరీక్షల్లో అద్భుతమైన ఫలితాలను ఇచ్చింది.

- మిగతా 2లో



## ‘ఆస్ట్రేలియాకు మోదీ నిజమైన మిత్రుడు’..

### ఆస్ట్రేలియా ప్రధాని ఆల్బనీస్

- మెల్‌బోర్న్‌లో భారతీయుల సభలో ప్రశంసలు
- భారత్‌తో బంధం మరింత బలపడిందన్న వ్యాఖ్యలు
- 2023 అహ్మదాబాద్ పర్యటనను గుర్తు చేసిన ఆల్బనీస్
- క్లిష్ట పరిస్థితుల్లో ముందు స్పందించేది భారతీయులేనని కితాబు
- భారతీయుల వల్ల ఆస్ట్రేలియా బలమైన దేశంగా మారిందని వ్యాఖ్య

- మిగతా 2లో





## ధాన్యం కొనుగోలులో రికార్డు సృష్టించాం

- రైతులు, రైస్ మిల్లర్లతో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో సెమినార్
- రెండో ఏడాది 74 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామన్న మనోహర్
- 95 శాతం చెల్లింపులను 24 గంటల్లో పూర్తి చేశామన్న మంత్రి

పెన్ పవర్ డెస్క్:కూటమి ప్రభుత్వంలో రెండేళ్ల ధాన్యం సేకరణ విజయవంతంగా పూర్తి కావడంతో విజయవాడలో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో రైతులు, రైస్ మిల్లర్లతో ప్రత్యేక సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ... సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మార్గదర్శకత్వంలో ధాన్యం కొనుగోలులో వినూత్న సంస్కరణలు

- మిగతా 2లో




నంద్యాల జిల్లాలో దశాబ్దాలుగా నలుగుతున్న క్లిష్టమైన భూ సమస్యకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన పర్యటనలోనే తక్షణ పరిష్కారం చూపారు. బేతంచర్ల మండలం గుటుపల్లి గ్రామానికి చెందిన 897 మంది రైతుల 2,074 ఎకరాల భూములను నిషేధిత 22ఏ జాబితా నుంచి విముక్తి కల్పించారు. కేవలం హామీ ఇవ్వడమే కాకుండా, బనగానపల్లె తహసీల్దార్ కార్యాలయంలోనే అధికారుల సమక్షంలో మొత్తం ప్రక్రియను దగ్గరుండి పూర్తి చేయించి, రైతులకు విముక్తి పత్రాలను అందజేశారు. గురువారం నంద్యాల జిల్లాలో పర్యటించిన సీఎం, ‘మీ భూమి–మీ హక్కు’ కార్యక్రమంలో భాగంగా ఈ చారిత్రక నిర్ణయం తీసుకున్నారు.

- మిగతా 2లో

ఏపీలో కారుణ్య మరణంపై స్పష్టత..

## అమల్లోకి కొత్త నిబంధనలు

- కారుణ్య మరణంపై మార్గదర్శకాలు విడుదల చేసిన ప్రభుత్వం
- సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా నిబంధనలు
- ‘లివింగ్ విల్’ ద్వారా చికిత్సపై ముందుగానే నిర్ణయం తీసుకునే అవకాశం
- రెండు దశల మెడికల్ బోర్డుల పరిశీలన తర్వాతే అమలుకు అనుమతి



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో నిష్క్రియాత్మక కారుణ్య మరణం (ప్యాసివ్ యూథనేషియా) అమలుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కీలక మార్గదర్శకాలను జారీ చేసింది. కోలుకునే అవకాశం లేని వ్యాధులతో బాధపడుతున్న రోగులకు జీవనాధార

- మిగతా 2లో



ఇది నా ఆత్మగౌరవం మీద దాడి... ప్రాణం ఉన్నంతవరకు

## ప్రకాశ్ రెడ్డిని వెంటాడుతూనే ఉంటా

- వైసీపీ నేత తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డిపై టీడీపీ ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తీవ్రస్థాయిలో ధ్వజం
- ఇది తన ఆత్మగౌరవానికి, ప్రకాశ్ రెడ్డి అహంకారానికి మధ్య జరుగుతున్న యుద్ధమని వ్యాఖ్య
- ప్రకాశ్ రెడ్డి సోదరుడిని కటకటాల వెనక్కి పంపే వరకు పోరాటం ఆగదని హెచ్చరిక
- తనపై చేసిన ఆరోపణలను గురువారం లోపు నిరూపించాలని ప్రకాశ్ రెడ్డికి సవాల్
- తోపుదుర్తి కుటుంబ చరిత్రపై, వారి ఆర్థిక లావాదేవీలపై సంచలన ఆరోపణలు

- మిగతా 2లో






## విశాఖలో కియాఎక్స్‌పోర్ట్ సెంటర్, శ్రీసిటీలో సునిక్ సిస్టమ్స్ యూనిట్..

### కొరియాలో లోకేశ్ కీలక భేటీలు

- దక్షిణ కొరియా పర్యటనలో మంత్రి నారా లోకేశ్
- శ్రీసిటీలో యూనిట్ ఏర్పాటు చేయాలని సునిక్ సిస్టమ్స్‌కు విజ్ఞప్తి
- ఏపీలో ఈవీ హబ్, విశాఖలో ఎక్స్‌పోర్ట్ సెంటర్ ఏర్పాటు చేయాలని కియాకు ప్రతిపాదన
- కొరియా ఉపమంత్రితో భేటీ.. ఇన్వెస్ట్‌మెంట్ డెస్క్ ఏర్పాటుకు విజ్ఞప్తి

- మిగతా 2లో

## పోక్సో కేసు: బండి భగీరథ్‌కు షరతులతో కూడిన బెయిల్

- దర్యాప్తునకు పూర్తిగా సహకరించాలని హైకోర్టు ఆదేశం
- 45 రోజులకు పైగా జైల్లో ఉన్న బండి భగీరథ్
- త్వరలో చార్జిషీట్ దాఖలు చేయనున్న పోలీసులు



పెన్ పవర్ డెస్క్: కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్‌కు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. పోక్సో చట్టం కింద నమోదైన కేసులో అతడికి గురువారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తూ న్యాయస్థానం ఉత్తర్వులు

- మిగతా 2లో

## రాజ్యసభ బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్‌గా వద్దిరాజు రవిచంద్ర

- ఫ్లోర్ లీడర్‌గా ముగిసిన సురేశ్ రెడ్డి పదవీకాలం
- ఆ స్థానంలో రవిచంద్రను నియమించిన కేసీఆర్
- కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపిన మున్నూరు కాపు సంఘం

పెన్ పవర్ డెస్క్:రాజ్యసభలో బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న సురేశ్ రెడ్డి పదవీకాలం ముగియడంతో, ఆయన స్థానంలో ప్రస్తుత డిప్యూటీ ఫ్లోర్ లీడర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్రను ఫ్లోర్ లీడర్‌గా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నియమించారు. పార్టీ కోసం వద్దిరాజు

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

## బీజేపీకి చెక్ పెట్టేందుకే పీకే ప్లాన్

తెరవెనుక ఉంటూ గొప్ప పొలిటికల్ స్ట్రాటజిస్టుగా పేరు తెచ్చుకున్న ప్రశాంత్ కిషోర్ జనసురాజ్ పార్టీ పెట్టి పెద్దగా సక్సెస్ కాలేదు. కానీ ఆయన గత ఎన్నికల్లో పోటీ చేయలేదు. కానీ ఇప్పుడు తానే స్వయంగా ప్రత్యక్ష ఎన్నికల గోదాలోకి దూకారు. ఆయన స్థాపించిన జన సూరాజ్ పార్టీ కోర్ కమిటీ నిర్ణయం ప్రకారం.. బీహార్‌లోని అత్యంత హై-ప్రొఫైల్ అసెంబ్లీ స్థానమైన బాంకీపూర్ ఉపఎన్నికలో ప్రశాంత్ కిషోర్ అభ్యర్థిగా పోటీ చేయబోతున్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికై, ఇటీవల రాజ్యసభకు వెళ్లిన సీనియర్ నేత నితిన్ నబీన్ తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడంతో ఈ స్థానానికి జూలై 30, 2026 న ఉపఎన్నిక జరగనుంది. గత ఏడాది జరిగిన బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో స్వయంగా పోటీ చేయడానికి వెనుకడుగు వేసిన పీకే.. ఇప్పుడు ఏకంగా బీజేపీకి కంచుకోట లాంటి స్థానంలో పోటీకి దిగడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.ప్రశాంత్ కిషోర్ ఈ నిర్ణయం తీసుకోవడం వెనుక పెద్ద రాజకీయ అనివార్యత దాగి ఉంది. గత 2025 బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో భారీ అంచనాలతో 238 స్థానాల్లో పోటీ చేసిన జన సూరాజ్ పార్టీ.. ఒక్క సీటులో కూడా గెలవలేక పూర్తిగా చాపచుట్టేసింది. ఈ ఘోర పరాజయం వల్ల పీకే సృష్టించిన పొలిటికల్ హైప్ ఒక్కసారిగా కరిగిపోయింది. పార్టీ ఉనికిని కాపాడుకోవాలన్నా, కేడర్‌లో తిరిగి ఉత్సాహం నింపాలన్నా తానే స్వయంగా యుద్ధరంగంలోకి రావాలని పీకే భావించారు. అందుకే, తదుపరి సార్వత్రిక పోరు దాకా ఆగకుండా, ఈ ఉపఎన్నికను తన రాజకీయ భవితవ్యానికి ఒక యాసిడ్ టెస్ట్ గా మార్చుకున్నారు. 1990ల కాలం నుండి గతంలో పట్నా వెస్ట్ గా ఉన్న ఈ నియోజకవర్గం బీజేపీకి అల్ట్రా-సేఫ్ సీటు. నితిన్ నబీన్ ఇక్కడి నుండి వరుసగా 5 సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. పట్నా నగర పరిధిలోని అత్యంత ధనిక, విద్యావంతులైన ఓటర్లు ఉన్న ఈ నియోజకవర్గంలో కమలం జెండాను కాదని వేరే పార్టీ గెలవడం దాదాపు అసాధ్యమనే టాక్ ఉందిఅయితే, ఇంతటి కఠినమైన నియోజకవర్గాన్ని పీకే ఎంచుకోవడం వెనుక కూడా ఒక స్ట్రాటజిస్ట్ మైండ్ దాగి ఉంది. బాంకీపూర్‌లో బీహార్‌లోనే అత్యధికంగా అక్షరాస్యత రేటు ఉంది. ఇక్కడి ఓటర్లు కుల సమీకరణాల కంటే అభ్యర్థి వ్యక్తిగత ఇమేజ్, విద్యార్హతలు చూసి ఓటు వేస్తారనే నమ్మకం పీకేకు ఉంది. బాంకీపూర్ ప్రజలు బీహార్‌లోనే అత్యంత చైతన్యవంతులు.. సరైన ప్రత్యామ్నాయం దొరికితే వారు మార్పు కోరుకుంటారు అని పీకే ఓటర్లను నేరుగా ఆకర్షిస్తున్నారు. పైగా, ఈ ఎన్నికను బీహార్ సీఎం సామ్రాట్ చౌదరి నేతృత్వంలోని ఎన్‌డీఏ కూటమి ఆర్నెల్ల పాలనపై ఒక రెఫరెండం గా ఆయన అభివర్ణిస్తున్నారు. ఒకవేళ ఇక్కడ ఓడిపోయినా బీజేపీ కోటలో గట్టి ఫైట్ ఇచ్చాం అని చెప్పుకోవచ్చు, పొరపాటున గెలిస్తే మాత్రం బీహార్ రాజకీయాల్లో జన సూరాజ్ తిరుగులేని శక్తిగా అవతరిస్తుందిప్రస్తుత గెలుపు అవకాశాలను అంచనా వేస్తే.. పీకేకు ఇది అత్యంత భారీ రిస్క్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. క్షేత్రస్థాయిలో బీజేపీ ఓటు బ్యాంక్ ఇక్కడ చాలా పటిష్టంగా ఉంది. పీకే రాకతో కాంగ్రెస్ నాయకుడు రిషి మిశ్రా లాంటి వారు మద్దతు ప్రకటిస్తున్నప్పటికీ.. అధికారిక ప్రతిపక్షమైన ఆర్జేడీ - కాంగ్రెస్ కూటమి మహాగఠ్‌బంధన్ ఇక్కడ సొంత అభ్యర్థిని నిలబెడితే ఓట్లు చీలిపోయి బీజేపీకి మరింత లాభం చేకూరుతుంది. పైగా బీహార్ మాజీ మంత్రి తేజ్ ప్రతాప్ యాదవ్ కొత్తగా పెట్టిన జన్శక్తి జనతా దళ్ తరఫున సామాజిక కార్యకర్త వీణా మాన్విని బరిలోకి దించడం కమలదళానికి రూట్ క్లియర్ చేస్తోంది.ఆగస్టు 3న వచ్చే ఫలితాల్లో పీకే గనుక ఇక్కడ డిపాజిట్ కోల్పోతే.. కేవలం ఢిల్లీ ఏసీ రూముల్లో కూర్చుని స్క్రిప్టులు రాసే కార్పొరేట్ స్ట్రాటజిస్టే తప్ప, గ్రౌండ్ లెవెల్ లీడర్ కాదంటూ ప్రత్యర్థులు ఆయన్ను రాజకీయంగా సమాధి చేసే ప్రమాదం ఉంది. అలా కాకుండా బీజేపీ మెజారిటీని భారీగా తగ్గించినా, లేదా అద్భుతం జరిగి గెలిచినా.. 2025 పరాభవానికి పీకే సరైన రివెంజ్ తీర్చుకున్నట్లవుతుంది. ఈ చావో రేవో పోరాటంలో పీకే మైండ్ గేమ్ గెలుస్తుందా, లేక కమలం కోట నిలుస్తుందా అనేది బీహార్ రాజకీయాల్లో ఇప్పుడు అత్యంత ఉత్కంఠ రేపుతోంది.

## హెచ్ఐవీ కట్టడికి కొత్త వ్యాక్సిన్... ప్రయోగాల్లో అద్భుత ఫలితాలు!

- మొదటి పేజి తరువాయి

ఈ వ్యాక్సిన్ ద్వారా అత్యంత శక్తివంతమైన, విస్తృత స్థాయిలో పనిచేసే యాంటీబాడీలు ఉత్పత్తి అయినట్లు పరిశోధకులు తెలిపారు. ఈ ఫలితాలు ప్రఖ్యాత 'నేచర్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.ఈ వ్యాక్సిన్‌ను లా జొల్లా ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఇమ్యునాలజీ, స్క్రిప్స్ రీసెర్చ్, మరియు ఇంటర్నేషనల్ ఎయిడ్స్ వ్యాక్సిన్ ఇనిషియేటివ్ సంస్థలు సంయుక్తంగా అభివృద్ధి చేశాయి. ఇది నేరుగా వైరస్‌పై దాడి చేసే బదులు, మన రోగనిరోధక వ్యవస్థలోని 'బి' కణాలకు దశలవారీగా శిక్షణ ఇస్తుంది. దీనివల్ల, నిరంతరం రూపాంతరం చెందే హెచ్ఐవీలోని అనేక రకాలను గుర్తించి, నిర్వీర్యం చేయగల శక్తివంతమైన యాంటీబాడీలు తయారవుతాయి.హెచ్ఐవీ తన రూపాన్ని మార్చుకుంటూ, రక్షణ కవచాలను ఏర్పరచుకోవడం వల్ల ఇప్పటివరకు వ్యాక్సిన్ అభివృద్ధి చేయడం సవాలుగా మారింది. అయితే, ఈ కొత్త విధానం ఆ అడ్డంకులను అధిగమించే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. జంతువులపై ఇంతటి సానుకూల ఫలితాలు రావడం ఇదే మొదటిసారని వారు పేర్కొన్నారు.ఈ ప్రయోగాల విజయంతో, ఇదే తరహా వ్యూహాలతో మానవులపై క్లినికల్ ట్రయల్స్ కూడా ప్రారంభమయ్యాయి. అయితే, మనుషుల్లో దీని భద్రత, సమర్థతపై పూర్తిస్థాయి డేటా రావడానికి మరికొంత సమయం పడుతుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుతం హెచ్ఐవీని నియంత్రించడానికి సమర్థవంతమైన మందులు అందుబాటులో ఉన్నప్పటికీ, ప్రపంచవ్యాప్తంగా కొత్త ఇన్ఫెక్షన్లను అరికట్టాలంటే వ్యాక్సిన్ కీలకం. ఈ పరిశోధన ఆ దిశగా పడిన ఒక ముఖ్యమైన ముందడుగుగా భావిస్తున్నారు.

## ధాన్యం కొనుగోలులో రికార్డు సృష్టించాం

- మొదటి పేజి తరువాయి

తెచ్చామన్నారు.గత ప్రభుత్వ హయాంలో 42 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, కూటమి ప్రభుత్వం రెండో ఏడాదిలో ఏకంగా 74 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించి రికార్డు సృష్టించిందన్నారు. రూ. 31 వేల కోట్ల విలువైన ధాన్యానికి సంబంధించి, 11.53 లక్షల మంది రైతులకు 95 శాతం చెల్లింపులను 24 గంటల్లోనే పూర్తి చేశామని తెలిపారు. ఏపీ తెచ్చిన '10 శాతం బ్రోకెన్ రైస్' విధానాన్ని కేంద్రం కూడా గుర్తించి దేశవ్యాప్తంగా అమలు చేయనుందని చెప్పారు. క్యూఆర్ కోడ్, వాట్సాప్ బుకింగ్, మాయిశ్చర్ మీటర్ల ద్వారా కొనుగోళ్లలో పారదర్శకత పెంచామని, రానున్న సీజన్‌లో ఎల్‌నినో ప్రభావాన్ని తట్టుకునేలా రైతులను సన్నద్ధం చేస్తామని మంత్రి పేర్కొన్నారు.

# 22ఏ సంకెళ్లు తెంచిన చంద్రబాబు ప్రభుత్వం... గుటుపల్లి రైతుల ఆనందం

అక్కడికక్కడే పరిష్కారం

ఈ ఏడాది మార్చి 9న డోన్ పర్యటనలో గుటుపల్లి రైతులు తమ భూములను గత ప్రభుత్వం అన్యాయంగా 22ఏ జాబితాలో చేర్చిందని, దీంతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చంద్రబాబుకు వినతిపత్రం ఇచ్చారు. ఆ వినతిని గుర్తుంచుకున్న ముఖ్యమంత్రి, గురువారం బనగానపల్లె పర్యటనలో ఆ రైతులను ప్రత్యేకంగా తహసీల్దార్ కార్యాలయానికి పిలిపించారు.

సమస్య పరిష్కారానికి రాష్ట్రస్థాయిలో చర్యలు పూర్తయ్యాయని, జిల్లా స్థాయిలో ప్రక్రియ ఎంతవరకు వచ్చిందని జిల్లా రిజిస్ట్రార్‌ను ప్రశ్నించారు. కలెక్టర్ నుంచి అధికారిక ఉత్తర్వులు అందనందున ఆన్‌లైన్ ప్రక్రియ మొదలు కాలేదని రిజిస్ట్రార్ చెప్పడంతో, సీఎం అక్కడికక్కడే కలెక్టర్‌తో మాట్లాడి ఉత్తర్వులను రిజిస్ట్రార్‌కు అందజేశారు. "త్వరలోనే పూర్తి చేస్తాం" అని అధికారి చెప్పగా, "త్వరలో కాదు, ఇప్పుడే పూర్తి చేయండి" అని ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. దీంతో అధికారులు వెంటనే రంగంలోకి దిగి, గుటుపల్లికి చెందిన 2,074 ఎకరాలను 22ఏ జాబితా నుంచి ఆన్‌లైన్‌లో తొలగించారు. ఇదే స్ఫూర్తితో బనగానపల్లె పట్టణానికి చెందిన 23 మంది రైతుల 101 ఎకరాల చుక్కల భూములను కూడా నిషేధిత జాబితా నుంచి తప్పించారు.

**రాష్ట్రవ్యాప్తంగా భూ సమస్యల పరిష్కారంపై దృష్టి**

బేతంచర్ల తరహాలోనే రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో దశాబ్దాలుగా పేరుకుపోయిన భూ వివాదాలను కూటమి ప్రభుత్వం పరిష్కరిస్తోంది. తిరుపతి జిల్లా శెట్టిపల్లి, గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు, చిత్తూరు జిల్లా కంగుంది గ్రామాల్లోని భూ సమస్యలకు ఇప్పటికే పరిష్కారం చూపింది. రీ సర్వే పేరుతో గత ప్రభుత్వం సృష్టించిన ఇబ్బందులను తొలగిస్తూ, లక్షలాది ఎకరాలకు విముక్తి కల్పిస్తోంది. ప్రభుత్వ తాజా నిర్ణయాలతో వేలాది మంది రైతుల కళ్లల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరిస్తూ, కొత్త పట్టాదారు పాసు పుస్తకాలను జారీ చేయడం ద్వారా రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది.

## చైనాలో ఘోర అగ్నిప్రమాదం.. షూ ఫ్యాక్టరీలో 28 మంది సజీవ దహనం

చైనాలో ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. ఆగ్నేయ చైనాలోని ఫుజియాన్ ప్రావిన్స్‌లో గల ఒక షూ ఫ్యాక్టరీలో గురువారం భారీ మంటలు చెలరేగడంతో 28 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. భవనంలో మరికొందరు చిక్కుకుని ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం అక్కడ సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.షూ రాజధానిగా పిలిచే జిన్‌జియాంగ్ నగరంలోని హుయిటెంగ్ షూస్ ఫ్యాక్టరీలో ఈ విషాదం చోటుచేసుకుంది. బహుళ అంతస్తుల భవనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో పరిసర ప్రాంతమంతా దట్టమైన నల్లటి పొగలు అలుముకున్నాయి. భవనం పైకప్పుపై చిక్కుకున్న కొందరు కార్మికులు ప్రాణరక్షణ కోసం ఆర్తనాదాలు చేస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే సుమారు 200 మంది అగ్నిమాపక సిబ్బంది 35 అగ్నిమాపక యంత్రాలతో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.షూ తయారీలో వినియోగించే మండే స్వభావం కలిగిన ముడి పదార్థాల వల్లే మంటలు వేగంగా వ్యాపించినట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఈ దుర్ఘటనపై చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇదొక భారీ ప్రాణ నష్టమని ఆవేదన వ్యక్తం చేస్తూ, సహాయక చర్యలను వేగవంతం చేయాలని, బాధితుల కుటుంబాలకు అండగా నిలవాలని అధికారులను ఆదేశించారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు.

## ఇది నా ఆత్మగౌరవం మీద దాడి... ప్రాణం ఉన్నంతవరకు ప్రకాశ్ రెడ్డిని వెంటాడుతూనే ఉంటా

మడకశిర టీడీపీ ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, వైసీపీ నేత తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తనపై నిరాధార ఆరోపణలు చేసి తన ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారని, ఇది తనకు, ప్రకాశ్ రెడ్డికి మధ్య జీవితకాలం జరిగే యుద్ధమని ప్రకటించారు. తన కంఠంలో ప్రాణం ఉన్నంతవరకు ప్రకాశ్ రెడ్డిని రాజకీయంగా వెంటాడతానని, వదిలిపెట్టే ప్రసక్తే లేదని శపథం చేశారు. ఈ మేరకు మడకశిర టీడీపీ ఎమ్మెల్యే ఎంఎస్ రాజు చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తున్నాయి.ఈ సందర్భంగా ఎంఎస్ రాజు మాట్లాడుతూ, "లేని ఆరోపణలు చేసి సమాజంలో నా గౌరవానికి భంగం కలిగించిన నిన్ను, నా ఆత్మగౌరవాన్ని దెబ్బకొట్టిన నిన్ను వదిలిపెట్టను. నీ అక్రమ ఆస్తుల దగ్గర నేనుంటా. నీ రాజకీయ పోరాటాన్ని చూస్తా. ఇది నా ఆత్మగౌరవం మీద జరిగిన దాడి. దున్నపోతు తల నరికే దొమ్మ పొగురున్న కులంలో పుట్టాను ప్రకాశ్.. భయం అనేది నాకు తెలీదు" అని తీవ్ర స్వరంతో హెచ్చరించారు.తోపుదుర్తి కుటుంబ చరిత్రపై కూడా రాజు సంచలన ఆరోపణలు చేశారు. "రూ.800 కోసం లారీ డ్రైవర్‌తో తన్నులు తిన్న చరిత్ర మీ సోదరుడిది. చెప్పుల షాపులో కస్టమర్లు వదిలివెళ్లిన పాత చెప్పులు దొంగలించిన చరిత్ర మీ కుటుంబానిది. అద్దె ఇళ్లలో ఉంటూ యజమానులకు అద్దె చెల్లించకుండా వేధించిన చరిత్ర మీది. సిగ్గు లేకుండా నా గురించి మాట్లాడతారా?" అని ప్రశ్నించారు. తన ఆరాధ్య దైవం చంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యుల గురించి నీచంగా మాట్లాడిన ప్రకాశ్ రెడ్డి సోదరుడు చంద్రశేఖర్ రెడ్డిని కటకటాల వెనక్కి పంపేంత వరకు తన పోరాటం ఆగదని రాజు స్పష్టం చేశారు. "నువ్వు ఎర మాత్రమే, నీ వెనక ఉన్న నీ అన్నే అసలు టార్గెట్" అని హెచ్చరించారు.తాను సామాన్య కుటుంబం నుంచి కష్టపడి ఈ స్థాయికి వచ్చానని, ఎలాంటి రాజకీయ నేపథ్యం లేదని రాజు గుర్తుచేశారు. "టీడీపీ కార్యకర్తగా, పసుపు సైనికుడిగా ఉండటమే నాకు ఐదో పదవి. ప్రాణం ఉన్నంతవరకు పసుపు జెండా మోస్తా. చంద్రబాబు గారు నన్ను టీటీడీ బోర్డు సభ్యుడిగా నియమిస్తే, దాన్ని ఆదాయ వనరుగా మార్చుకోలేదు. నా గదికి నేనే అద్దె కడతాను, కనీసం లడ్డూ కూడా తీసుకోను. కానీ మీరు టీటీడీని వ్యాపారంగా మార్చుకున్నారు" అని ఆరోపించారు.తనపై చేసిన ఆరోపణలను నిరూపించాలని ప్రకాశ్ రెడ్డికి రాజు సవాల్ విసిరారు. "నాకు విల్లా ఎక్కడుంది?

నా పార్టీ ఆఫీసు స్థలం ఎక్కడ? బెంగళూరులో నాకు ఆస్తులు ఎక్కడున్నాయో చూపించు. నీకు గురువారం వరకు సమయం ఇస్తున్నా. ఆరోపణలు నిరూపించు లేదా పరిణామాలకు సిద్ధంగా ఉండు" అని డిమాండ్ చేశారు. ఇది కేవలం రాజకీయ పోరాటం కాదని, తన ఆత్మగౌరవ పోరాటమని, తాను ఒక్కడినే పోరాడతానని ఎంఎస్ రాజు తేల్చిచెప్పారు.

## విశాఖలో కియాఎక్స్‌పోర్ట్ సెంటర్, శ్రీసిటీలో సునిక్ సిస్టమ్స్ యూనిట్..

ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ దక్షిణ కొరియాలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఐదో రోజు (గురువారం) ఆయన పలు దిగ్గజ కంపెనీల ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులతో సమావేశమయ్యారు. ఏపీలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వారికి వివరించారు.

సియోల్‌లో కియా మోటార్స్ గ్లోబల్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ టే హన్ లీ, ఇతర ఉన్నతాధికారులతో లోకేశ్ భేటీ అయ్యారు. ఏపీలో ఇంటిగ్రేటెడ్ ఎలక్ట్రిక్, హైబ్రిడ్ వాహనాల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసి కార్యకలాపాలను మరింత విస్తరించాలని కోరారు. ప్రపంచ మార్కెట్ల కోసం విశాఖపట్నం పోర్టు సమీపంలో ఒక సీకేడీ అసెంబ్లింగ్, ఎక్స్‌పోర్ట్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.అంతకుముందు, సెమీకండక్టర్స్, ఓఎల్ఈడీ డిస్‌ప్లే పరికరాల తయారీ సంస్థ సునిక్ సిస్టమ్ సీఈవో ఎస్.డబ్ల్యూ. చుంగ్‌తో లోకేశ్ సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీలో డిస్‌ప్లే పరికరాల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఇందుకు ముందుకొస్తే జాయింట్ వెంచర్ ఏర్పాటుకు

ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.తన పర్యటనలో భాగంగా లోకేశ్.. దక్షిణ కొరియా రాజకీయ వ్యవహారాలు, విదేశాంగశాఖ ఉపమంత్రి యుయ్-హే సిసిలియా చుంగ్‌తోనూ భేటీ అయ్యారు. ఏపీలో అమలు చేస్తున్న 3ఎస్ (స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్) విధానం కొరియా పెట్టుబడిదారులకు రక్షణ కవచంలా నిలుస్తుందని వివరించారు. ఏపీ-కొరియా ఇన్వెస్ట్‌మెంట్ డెస్క్, కొరియన్ కల్చరల్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఈ సమావేశంలో కోరారు.

## పోక్సో కేసు: బండి భగీరథ్‌కు షరతులతో కూడిన బెయిల్

- మొదటి పేజి తరువాయి

జారీ చేసింది. దర్యాప్తునకు పూర్తిగా సహకరించాలని ఈ సందర్భంగా భగీరథ్‌ను హైకోర్టు ఆదేశించింది.

ఒక మైనర్ బాలికకు సంబంధించిన ఉదంతంలో మే 8వ తేదీన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో భగీరథ్‌పై పోక్సో కేసు నమోదైంది. ఈ కేసులో మే 16న పోలీసులు అతడిని అరెస్ట్ చేయగా, అప్పటి నుంచి చర్లపల్లి జైలులో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నాడు. దాదాపు 45 రోజులుగా అతడు జైలులోనే ఉంటున్నాడు.బెయిల్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా భగీరథ్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, నిందితుడు విద్యార్థి అని, జైలులో ఉండటం వల్ల చదువు నష్టపోతున్నాడని కోర్టుకు విన్నవించారు. అయితే, పబ్లిక్ ప్రాసిక్యూటర్ బెయిల్‌ను ద

వ్యతిరేకించారు. దర్యాప్తు కీలక దశలో ఉందని, నిందితుడిని విడుదల చేస్తే సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని వాదించారు.

ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ కె. సుజన భగీరథ్‌కు బెయిల్ మంజూరు చేశారు. కాగా, తన బీబీఏ పరీక్షలకు హాజరయ్యేందుకు భగీరథ్‌కు గతంలో హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే.

## 'ఆస్ట్రేలియాకు మోదీ నిజమైన మిత్రుడు'..

ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ ఆల్బనీస్ మరోసారి ప్రధాని నరేంద్ర మోదీపై ప్రశంసలు కురిపించారు. మోదీ ఆస్ట్రేలియాకు నిజమైన మిత్రుడని, తనకు ఎంతో ఆప్తుడని అన్నారు. మెల్‌బోర్న్‌లో జరిగిన 'మెల్‌బోర్న్ మీట్స్ మోదీ' కార్యక్రమంలో భారతీయులను ఉద్దేశించి మాట్లాడిన ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.మెల్‌బోర్న్‌లోని మార్వెల్ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో భారతీయులు హాజరయ్యారు. ఎన్నో చారిత్రక కార్యక్రమాలకు ఈ స్టేడియం వేదికగా నిలిచిందని, కానీ భారతీయుల ఈ సమావేశం అత్యంత ప్రత్యేకమైందని ఆల్బనీస్ అన్నారు. ఈ సభలో కనిపిస్తున్న ఉత్సాహమే భారత్, ఆస్ట్రేలియా మధ్య ఉన్న బలమైన బంధానికి నిదర్శనమని పేర్కొన్నారు.ప్రధానిగా తాను రెండుసార్లు భారత్‌లో పర్యటించే అవకాశం దక్కిందని ఆల్బనీస్ గుర్తు చేసుకున్నారు. భారతదేశ అందాలు, ప్రజల ఆతిథ్యం తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని చెప్పారు. 2023లో అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో మోదీతో కలిసి రథంలో ప్రయాణించిన అనుభవాన్ని ఎప్పటికీ మరిచిపోలేనని అన్నారు. అప్పట్లో గుజరాత్‌లో చూసిన ఆప్యాయత, ఇప్పుడు ఈ సభలోనూ కనిపిస్తోందని వ్యాఖ్యానించారు.భారత సంతతి ప్రజలు ఆస్ట్రేలియా అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని ఆల్బనీస్ కొనియాడారు. ఆరోగ్యం, ఐటీ వంటి రంగాల్లో తమ సేవలు అందిస్తున్నారని చెప్పారు. చిన్న వ్యాపారాల అభివృద్ధికి తోడ్పడటంతో పాటు విద్యా రంగాన్ని కూడా బలోపేతం చేస్తున్నారని తెలిపారు. క్లిష్ట పరిస్థితులు వచ్చినప్పుడు ముందుగా స్పందించి సాయం చేసేది భారతీయులేనని వెల్లడించారు.భారతీయుల వల్ల ఆస్ట్రేలియా మరింత బలమైన, వైవిధ్యభరితమైన దేశంగా మారిందని ఆల్బనీస్ అన్నారు. భారత్, ఆస్ట్రేలియా మధ్య బంధాన్ని మరింత బలపరిచే సజీవ వారధి భారత సంతతి ప్రజలేనని కొనియాడారు.

## ఏపీలో కారుణ్య మరణంపై స్పష్టత.. అమల్లోకి కొత్త నిబంధనలు

- మొదటి పేజి తరువాయి

వ్యవస్థలను ఉపసంహరించుకోవడానికి వీలు కల్పిస్తూ ఈ నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్య కుమార్ యాదవ్ జులై 8న ఈ విధివిధానాలకు అధికారికంగా ఆమోదం తెలిపారు. సుప్రీంకోర్టు నిర్దేశించిన 'గౌరవప్రదంగా మరణించే హక్కు'కు అనుగుణంగా ఈ నిబంధనలను రూపొందించారు. ప్యాసివ్ యూథనేషియా అంటే కోలుకోలేని స్థితిలో ఉన్న రోగులకు వెంటిలేటర్లు, ఫీడింగ్ ట్యూబ్‌లు వంటి కృత్రిమ వైద్య సహాయాన్ని నిలిపివేసి, వారు సహజంగా మరణించేందుకు అనుమతించడం. ఇది భారతదేశంలో నిషేధించబడిన 'యాక్టివ్ యూథనేషియా'కు భిన్నమైనది. సుప్రీంకోర్టు 2018లో 'కామన్ కాజ్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో చారిత్రాత్మక తీర్పునిస్తూ ప్యాసివ్ యూథనేషియాకు అనుమతించినప్పటికీ, రాష్ట్ర స్థాయిలో స్పష్టమైన మార్గదర్శకాలు లేకపోవడంతో ఇప్పటివరకు అనిశ్చితి నెలకొంది.

**మార్గదర్శకాలలోని ముఖ్యాంశాలు**

ఈ కొత్త నిబంధనల ప్రకారం, స్పృహలో ఉన్న ఏ వ్యక్తి అయినా 'అడ్వాన్స్ డైరెక్టివ్' (ముందస్తు వీలునామా) రాసుకోవచ్చు. దీని ద్వారా భవిష్యత్తులో తనకు ఎలాంటి చికిత్స అందించాలో లేదా నిలిపివేయాలో ముందుగానే నిర్ణయించుకునే అవకాశం ఉంటుంది. ఇద్దరు సాక్షుల సమక్షంలో నోటరీ లేదా గెజిటెడ్ అధికారి ద్వారా ఈ పత్రాన్ని ధృవీకరించుకోవాలి.

ఒకవేళ రోగి పరిస్థితి విషమించి, చికిత్స ఫలించదని భావిస్తే సంబంధిత ఆసుపత్రి ఒక 'ప్రైమరీ మెడికల్ బోర్డు'ను ఏర్పాటు చేయాలి. ఈ బోర్డు 48 గంటల్లోగా తన నివేదికను సమర్పిస్తుంది. వారి సిఫార్సుల అనంతరం, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి (డీఎంహెచ్ఓ) నేతృత్వంలోని 'సెకండరీ మెడికల్ బోర్డు' తుది నిర్ణయం తీసుకుంటుంది. కుటుంబ సభ్యుల అంగీకారం, జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్‌కు సమాచారం అందించిన తర్వాతే వైద్య సహాయాన్ని నిలిపివేస్తారు. ఈ నిబంధనల అమలును డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ సహా ఇతర ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తారు. తాజా మార్గదర్శకాల వల్ల రోగుల కుటుంబాలపై మానసిక, ఆర్థిక భారం తగ్గడంతో పాటు, వైద్యులకు చట్టపరమైన రక్షణ లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

## రాజ్యసభ బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్‌గా వద్దిరాజు రవిచంద్ర

- మొదటి పేజి తరువాయి

చేసిన సేవలను గుర్తించి ఈ కీలక బాధ్యతలు అప్పగించారు.ఈ నియామకం పట్ల తెలంగాణ మున్నూరు కాపు సంఘం నాయకులు పార్టీ అధినేత కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వద్దిరాజు రవిచంద్రకు ఈ ఉన్నత పదవి దక్కడం బీసీల ఎదుగుదలకు, తెలంగాణ హక్కుల సాధనకు ఎంతో కీలకంగా మారుతుందని మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు సర్దార్ పుటం పురుషోత్తం పటేల్ ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్రం నుంచి తెలంగాణ రాష్ట్రానికి రావలసిన రాజ్యాంగపరమైన నిధులు, హక్కుల సాధనలో వద్దిరాజు పార్లమెంట్‌లో మరింత సమర్థవంతంగా గళం విప్పుతారని మున్నూరు కాపు సమాజం ఆశాభావం వ్యక్తం చేసింది.

# చిల్లకూరులో ఎన్ టీ ఆర్ భూమి పూజ చేసిన స్థలం లో వై ఎస్ ఆర్ పార్టీ నాయకులు మట్టి పోశారు. అని టీడీపీ నాయకులు ఆరోపణ...

## అధికారులు, పోలీస్ లు జోక్యం చేసుకోవడంతో అదుపులోకి వచ్చినా శాంతి భద్రతలు...





పెళ్లకూరు, పెన్ పవర్, జూలై 9 తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలం చిల్లకూరు గ్రామంలో జూన్ 24వ తేదీన తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారక రామారావు విగ్రహాన్ని ప్రతిష్టించుటకు తెలుగుదేశం పార్టీ నాయకులు సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్చార్జి నెలవల.సుబ్రహ్మణ్యం చేతుల మీదగా భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. అయితే ఇది తనకు సంబంధించిన స్థలమని ఇక్కడ విగ్రహం పెట్టడానికి వీలు లేదని గత కొద్ది రోజులుగా వైయస్సార్సీపి రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి. సత్యనారాయణరెడ్డి అభ్యంతరం చెప్పుతూ వచ్చారు. అయితే ఈరోజు ఉదయం భూమి పూజ చేసినటువంటి స్థలంలో గుంటను సత్యనారాయణ రెడ్డి దగ్గర ఉండి పాత ఇంటి ప్రహరీ నిర్మాణం చేసుతున్నటువంటి మట్టిని భూమి పూజ గుంటను పుడచడంతో ఈ విషయము స్థానికంగా ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకులకు కార్యకర్తలకు తెలిసి అందరూ గుమ్మిగుడటంతో వైఎస్ఆర్సిపి నాయకుడైన సత్యనారాయణ రెడ్డికి తెలుగుదేశం పార్టీ నాయకులకు మధ్య మాట పెరగడంతో వివాదం పెద్దదయి తీవ్రంగా దూషించుకోవడం జరిగింది. అయితే తెలుగుదేశం నాయకులు తమ అభిమాన నాయకుడైన ఎన్టీఆర్ విగ్రహానికి సత్యనారాయణ రెడ్డి అడ్డుపడటమే కాకుండా తమపై దాడి చేశారంటూ ఆరోపిస్తున్నారు. ఈ విషయంము ఇరు పార్టీల నాయకులు ప్రతిష్టగా తీసుకోవడంతో రెండు పార్టీల నాయకులు, కార్యకర్తలు చిల్లకూరు గ్రామంలోని విగ్రహా స్థలానికి చేరుకోవడం తో ఉద్రిత పరిస్థితులు చోటు చేసుకొన్నాయి. ఈ విషయం పోలీసులు దృష్టికి వెళ్లడంతో పెళ్లకూరు సబ్ ఇన్స్పెక్టర్ దారం. ఆదిలక్ష్మి, నాయుడుపేట,సీఐ సంగమేశ్వరావు హుటా హుటిన చిల్లకూరు గ్రామం లోని విగ్రహనికి భూమి పూజ చేసిన స్థలం దగ్గరికి చేరుకొని పంచాయతీ కార్యదర్శి ఇచ్చిన ధ్రువీకరణ పత్రం ఆధారంగా ఇది ప్రభుత్వ స్థలం అని మీరు గుంటను ఎందుకు పుడచ్చుతారు అని సత్య నారాయణ రెడ్డి ని ప్రశ్న ఇంచడం ఇలాంటి పనులు చేయవద్దు అంటూ పోలీసులు దగ్గర ఉండి మట్టిని జేసీబీ తో తీసివేసి యదథాద స్థితి కి తీసుకొని రావడంతో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు శాంతించారు. ఇరు పార్టీలకు చెందిన నాయకులు కార్యకర్తలు గ్రామం లో ఉండటంతో ఎలాంటి వివాదం లేకుండా సీఐ సగమేశ్వరావు పోలీస్ లను బందోబస్త్ పెట్టడం జరిగింది. దీనితో శాంతి భద్రతలు అదుపులోకి వచ్చాయి. ఈ వివాదం విషయం లో దేశం పార్టీ నాయకులు కొందరు కామిరెడ్డి. సత్యనారాయణ రెడ్డి తమపై దాడి చేసారంటూ పిర్యాదు ఇచ్చే విషయం ఆలోచిస్తున్నాట్టు తెలుసుతుంది.

# ప్రిన్సిపాల్ రిపోర్టులు పరిగణలో తీసుకొని సిబ్బందిని తొలగిస్తారా? " ఎస్సీ కమిషన్ ఫైర్ "





నాయుడుపేట, పెన్ పవర్, జూలై 9 సిబ్బందిపై చర్యలు చేపట్టేందుకు అన్ని కోణాల్లో ఆలోచించి ఎందుకు చర్యలు చేపట్టలేదు, ప్రిన్సిపాల్ పంపిన రిపోర్టులు పరిగణలో తీసుకొని సిబ్బందిని తొలగిస్తారా అంటూ ఎస్సీ కమిషన్ సభ్యులు డాక్టర్ శ్రీపతి బాబు, డాక్టర్ గౌతమ్ రాజు, మేకల బిక్షం లు బిసి గురుకులాల డిప్యూటీ సెక్రటరీ పై ఫైర్ అయ్యారు. దొరవారి సత్రం మండల కేంద్రంలోని బీసీ బాలుర గురుకులంలో గత 8 ఏళ్లుగా గెస్ట్ లెక్చరర్లుగా పనిచేస్తున్న ఏడుగురిని సరియైన కారణాలు లేకుండా తొలగించారని సభ్యులు ఫిర్యాదు మేరకు గురువారం ఎస్సీ కమిషన్ విచారణ చేపట్టింది. కమిటీ విచారణ ముందు డిప్యూటీ సెక్రటరీ మాధవయ్య సమయపాలన పాటించకుండా ఆలస్యంగా హాజరు కావడంతో కమిషన్ సభ్యులు మండిపడ్డారు. ప్రభుత్వ సేవకులుగా పనిచేస్తూ సమయపాలన పాటించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. సరియైన కారణాలు లేకుండా, సమగ్ర విచారణ చేపట్టకుండా దళిత గెస్ట్ లెక్చరర్ లను ఆ కారణంగా తొలగించినట్లుగానే తెలుస్తోందన్నారు. విచారణకు హాజరైన డిప్యూటీ సెక్రటరీ మాధవయ్య, జిల్లా కన్వీనర్ మహేశ్వరి, ఇన్చార్జి ప్రిన్సిపాల్ సుజీ వన రావు కమిటీ సభ్యులు అడిగిన ప్రశ్నలకు సరియైన సమాధానం ఇవ్వలేకపోయారు. ఇంటర్ ఫలితాల్లో అనుకున్న శాతం సాధించలేదని, విద్యార్థులను క్రమశిక్షణలో తప్పుదోవ పట్టిస్తున్నారని, పలు కారణాలపై ఎందుకు సమగ్ర విచారణ చేపట్టలేదని నిలదీశారు. 8 ఏళ్లుగా సక్రమంగా పనిచేస్తూ వారి సబ్జెక్టులలో 90 శాతం పై ఉత్తమ ఫలితాలు సాధించారు కదా! ఎందుకు ఆకారణాలను చూపిస్తున్నారు. జిల్లా కోఆర్డినేటర్ విచారణ నివేదిక కూడా లేదు, ప్రిన్సిపాల్ నివేదికలు పెట్టుకుని సిబ్బందిని తొలగించడం సరియైన విధానం కాదని సూచించారు. తొలగించబడిన దళితుల పొట్ట కొట్టడం సరియైన పద్ధతి కాదని సూచించారు. ప్రిన్సిపాల్ ఇచ్చిన నివేదిక, ప్రవర్తన సరిలేదని కొందరు కార్యదర్శి కి పంపిన లేఖలను కూడా పరిశీలించారు. తొలగించబడిన బాధితులకు ఎటువంటి షోకాస్ నోటీసులు పంపకుండా, సలహాలు సూచనలు ఇవ్వకుండానే సరాసరి తొలగించడం సరియైన విధానం కాదని, ఇటువంటి నిర్ణయాలు అధికారులు తీసుకోవడం ప్రభుత్వ పరిపాలనకు మాయని మచ్చగా ఉంటుందని పేర్కొన్నారు. కమిషన్ సభ్యులు అన్ని కోణాల్లో ఐదు గంటలు పాటు విచారణ చేపట్టారు. అటు అధికారుల నుండి బాధితులతో పాటు వారి వాంగ్మూలం సేకరించారు. అనంతరం కళాశాలలో చదువుతున్న విద్యార్థుల నుండి తొలగింపబడిన లెక్చరర్ల పనితీరు,ప్రవర్తన పై ఆరా తీశారు, వారి నుండి ఎల్లికితపూర్వకంగా నివేదికలు సేకరించారు. ఒకే చోట పని చేస్తున్న సిబ్బంది, లోటుపాట్లు ఏవైనా ఉంటే ప్రిన్సిపాల్ పై సరి చేయాల్సిన బాధ్యత ఉందని గుర్తు చేశారు. విచారణ నివేదికను పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి, సంబంధిత అధికారులతో చర్చించి న్యాయపరమైన నిర్ణయం తీసుకుంటామని, నష్టపోయిన, తొలగింపబడిన అభ్యర్థులకు న్యాయం జరిగేలా చూస్తామని కూడా వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రఎస్సీ కమిషన్ సభ్యులు డాక్టర్ శ్రీపతి బాబు, డాక్టర్ గౌతమ్ రాజు, మేకల బిక్షం, బిసి గురుకులాల డిప్యూటీ సెక్రటరీ మాధవయ్య, జిల్లా కోఆర్డినేటర్ మహేశ్వరి, ప్రిన్సిపాల్ తిరుపతయ్య, ఇన్చార్జి ప్రిన్సిపాల్ సుజీ వన రావు, డీఎస్పీ చెంచు బాబు,తాసిల్దార్ రాజేంద్ర, జీవి చౌదరి, పలువురు సిబ్బంది హాజరయ్యారు.

# వైభవంగా శ్రీ కోదండ రామస్వామి వారి కళ్యాణోత్సవం పాల్గొన్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి






బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ జులై 9. ఇసుకపాళెం పంచాయతీ పరిధిలోని గోపాలపురం గ్రామంలో అత్యంత వైభవంగా జరిగిన శ్రీ కోదండ రామస్వామి వారి తిరునాల మహోత్సవాలు గురువారంతో ముగిశాయి. గ్రామస్తుల ప్రత్యేక ఆహ్వానం మేరకు తిరునాల చివరి రోజున నిర్వహించిన స్వామి వారి కళ్యాణోత్సవంలో కోవూరు నియోజకవర్గ శాసనసభ్యురాలు శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పాల్గొన్నారు. గ్రామంలో మూడు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ తిరునాల వేడుకలు కన్నులపండువగా సాగాయి. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు స్వామి వారికి హనుమంతు సేవ, రెండో రోజు గరుడ సేవ కార్యక్రమాలను నిర్వహించారు. మూడో రోజు ముగింపు వేడుకల్లో భాగంగా స్వామి వారి కల్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేసి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ, గ్రామస్తులందరూ ఎంతో ఐక్యమత్యంతో, భక్తిభావంతో తిరునాలా ఉత్సవాలను ఇంత ఘనంగా నిర్వహించడం సంతోషకరమన్నారు. ఆ కోదండ రామస్వామి వారి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు.

పెన్ పవర్
రాయలసీమ
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా । తిరుపతి జిల్లా । చిత్తూరు జిల్లా । వై.ఎస్.ఆర్. కడప జిల్లా ।

# మడకశిర ఎమ్మెల్యేపై విమర్శలు ఖండించిన జమ్మలబండ నాయకులు

గుడిబండ, (పెన్ పవర్)జూలై 9: గుడిబండ మండలం పరిధిలో జమ్మలబండ గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్, గుడిబండ మండల తెలుగు దేశం పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్ మూర్తి ఆధ్వర్యంలో జమ్మలబండ గ్రామానికి చెందిన యువ నాయకులు, టీడీపీ నాయకులు గురువారం అనంతపురంలో ఈ సందర్భంగా ఉమ్మడి అనంతపురం జిల్లా రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి మడకశిర శాసనసభ్యులు ఎంఎస్ రాజుపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వారు తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో రాజకీయ విమర్శలు హుందాగా ఉండాలని, వ్యక్తిగత దూషణలు, అసభ్యకర వ్యాఖ్యలు చేయడం సరికాదని పేర్కొన్నారు. మడకశిర నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే ఎంఎస్ రాజు నిరంతరం కృషి చేస్తున్నారని, ఆయనపై నిరాధార ఆరోపణలు చేసి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు మానుకోవాలని వారు సూచించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే ఎంఎస్ రాజుకు అండగా ఉంటారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జమ్మలబండ గ్రామానికి చెందిన తెలుగు దేశం పార్టీ నాయకులు, యువకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పొలం దారి వివాదం తీవ్ర కలకలం రేపుతుంది



బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ జూలై 9. బుచ్చిరెడ్డిపాలెం మండలం చెల్లాయిపాలెం గ్రామంలో పొలం దారి వివాదం తీవ్ర కలకలం రేపుతోంది. తాండ్ర శరణ్య, తాండ్ర తనూజల ద్వారా తనకు ప్రాణహాని ఉందని, తనకు రక్షణ కల్పించి న్యాయం చేయాలని గ్రామానికి చెందిన తమ్మిరెడ్డి మల్లికార్జున ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మీడియా సమావేశం నిర్వహించిన ఆయన వివరాలు తెలిపారు. 2005వ సంవత్సరంలో తనకు, తన తమ్ముడికి ఆస్తి పంపకాలు జరిగాయని మల్లికార్జున తెలిపారు. ఆ పంపకాల్లో తనకు మూడు ఎకరాలు, తన తమ్ముడికి మూడు ఎకరాల పొలం వచ్చిందన్నారు. అయితే పొలానికి సంబంధించిన దారి వివాదం నేపథ్యంలో 2024లో తన తమ్ముడి భార్య, కుమార్తెలు తనపై దాడులు చేయించారని ఆరోపించారు. ఆ ఘటనకు సంబంధించిన కేసులో వారు జైలు శిక్ష కూడా అనుభవించారని పేర్కొన్నారు. ఇటీవల తాండ్ర తనూజ, తాండ్ర శరణ్య తనపై దౌర్జన్యానికి పాల్పడటమే కాకుండా... తనపైనే కేసులు పెట్టించి ఎఫ్ఐఆర్ నమోదు చేయించారని మల్లికార్జున ఆరోపించారు. పొలం వివాదానికి సంబంధించి కోర్టు ఇంజంక్షన్ ఆర్డర్ ఉన్నప్పటికీ... సివిల్ వివాదంలో సీఐ ఎలా జోక్యం చేసుకుంటారని ఆయన ప్రశ్నించారు. తమపై కక్షసాధింపు ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ... సివిల్ వివాదంలో పోలీసులు జోక్యం చేసుకోకుండా ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా... నిన్న తన పొలంలోకి ప్రవేశించి పంటను నాశనం చేసేందుకు ప్రయత్నించారని మల్లికార్జున ఆరోపించారు. తనను చంపేస్తామంటూ బెదిరిస్తున్నారని... తనకు ప్రాణహాని ఉందని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తనకు తక్షణ రక్షణ కల్పించి, అన్ని విధాలా న్యాయం చేయాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, మంత్రి నారా లోకేష్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పోలీసు ఉన్నతాధికారులను తమ్మిరెడ్డి మల్లికార్జున వేడుకున్నారు.

# నాయుడుపేటలో ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం




నాయుడుపేట, పెన్ పవర్, జూలై 9 నాయుడుపేట పట్టణంలో గురువారం ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఏబీవీపీ ప్రాంత ఎస్ ఎఫ్ డి కో కన్వీనర్ తడకుచందు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయుడుపేట డి.ఎస్.పి చెంచు బాబు ఏబీవీపీ జండాను ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత ఫలితాలు సాధించాలన్నారు. దుర్వసనాలకు దూరంగా ఉండి, తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని సూచించారు. అనంతరం ఏబీవీపీ విద్యార్థులు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు పవన్, కిషోర్,వినయ్,అమిన్ కేశవ, భరత్,నాయుడుపేట పట్టణ ఏబీవీపీ కమిటీ సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నినోపై రైతులకు అవగాహన కల్పిస్తాం.. సమస్యను అధిగమిస్తాం: నాదెండ్ల మనోహర్



విజయవాడ, పెన్ పవర్,జూలై09 కూటమి ప్రభుత్వంలో రెండేళ్ల ధాన్యం సేకరణ విజయవంతంగా పూర్తవడంపై పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో రైతులు, రైస్ మిల్లర్లతో ప్రత్యేక సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ.. గత రెండేళ్లుగా కూటమి ప్రభుత్వం ధాన్యం కొనుగోలులో వినూత్న సంస్కరణలను అమలు చేసిందన్నారు. సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ద్వారా రైతులు, రైస్ మిల్లర్ల మధ్య సమన్వయంతో కొనుగోలు ప్రక్రియ నిర్వహిస్తోందని తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మార్గదర్శకత్వంలో రాష్ట్ర చరిత్రలోనే అత్యుత్తమ ధాన్యం కొనుగోలు చేపట్టినట్లు చెప్పారు. జిల్లా స్థాయిలో అధికారులు బాగా పని చేశారని కొనియాడారు.

రానున్న సీజన్లో ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన కల్పిస్తామని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో 42 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, కూటమి ప్రభుత్వం రెండో ఏడాదిలో 74 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసిందని వివరించారు. రూ.31 వేల కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేసి, 11.53 లక్షల మంది రైతులకు 95 శాతం చెల్లింపులు 24 గంటల్లోనే చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో మధ్యాహ్న భోజన పథకానికి నాణ్యమైన బీపీటీ బియ్యం అందిస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ అమలు చేస్తున్న 10 శాతం బ్రోకెన్ రైస్ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం గుర్తించి దేశవ్యాప్తంగా అమలు చేయాలని నిర్ణయించిందన్నారు. ప్రతి ధాన్యం బస్తాకు క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేసి, ఎండ్‌ టు ఎండ్ విధానం ద్వారా రైతు నుంచి ఫెయిర్ ప్రైస్ షాప్ వరకు పూర్తి వివరాలు తెలుసుకునే వ్యవస్థ ఏర్పాటు చేశామన్నారు. వాట్సాప్ ద్వారా రైతులు ధాన్యం విక్రయించుకునే సౌకర్యాన్ని కల్పించామని వెల్లడించారు.

గన్నీ బ్యాగులు, గోదాములు, రవాణా, తేమ శాతం వంటి అంశాల్లో పారదర్శకత పెంచేందుకు చర్యలు తీసుకున్నామని నాదెండ్ల తెలిపారు. ఖరీఫ్ నుంచి రైతు సేవా కేంద్రాల్లోనే గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచామన్నారు. రవాణా జాప్యాన్ని నివారించేందుకు ట్రాన్స్‌పోర్ట్ ఖర్చులను కూడా 48 గంటల్లో రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నామని తెలిపారు. ఆర్ఎఫ్ఐడీ స్టిక్కర్లు, స్కానర్లతో లారీల కదలికలను పర్యవేక్షించే వ్యవస్థ అమలు చేస్తున్నామని చెప్పారు. తేమ కొలిచే మాయిశ్చర్ మీటర్లు అన్ని చోట్లా ఒకే కంపెనీ, ఒకే మోడల్‌లో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రస్తుతం 90 శాతం ఏర్పాటు పూర్తవగా, ఖరీఫ్ నాటికి 100 శాతం పూర్తి చేస్తామని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో ఈ సీజన్‌లో వరి ఉత్పత్తి సుమారు 15 శాతం తగ్గే అవకాశం ఉందని ప్రాథమిక అంచనాలు ఉన్నాయన్నారు. రైతులకు ముందస్తు అవగాహన కల్పించి, అవసరమైన సూచనలు అందించి సమస్యలను అధిగమించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టనున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

# సొంత కాళ్లపై నిలబడే చిరు వ్యాపారులకు 'వీపీఆర్' ఆర్థిక చేయూత

## కోవూరు ఎమ్మెల్యే శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి
## ఐదు మండలాల లబ్ధిదారులకు ఉచితంగా తోపుడు బండ్ల పంపిణీ
## రెండో విడతలో 41 మందికి అందజేత







కోవూరు పెన్ పవర్ జులై 9. చిరువ్యాపారులు ఆర్థికంగా ఎదగాలనేదే ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సంకల్పం స్వశక్తితో జీవనం సాగించే ఒంటరి మహిళలు, వృద్ధ చిరువ్యాపారుల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా వీపీఆర్ ఫౌండేషన్ ఉచితంగా తోపుడు బండ్లు పంపిణీ చేస్తోందని కోవూరు ఎమ్మెల్యే శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం నెల్లూరులోని వీపీఆర్ కార్యాలయంలో కోవూరు నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన 41 మంది లబ్ధిదారులకు ఉచితంగా తోపుడు బండ్లు పంపిణీ చేశారు.


ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్వశక్తితో తమ కాళ్లపై తాము నిలబడి చిరువ్యాపారాలు చేసుకుంటున్న ఒంటరి మహిళలు, వృద్ధులు ఉపాధి కోసం అద్దెకు తోపుడు బండ్లు తీసుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. వచ్చే స్వల్ప ఆదాయంలో కొంత భాగాన్ని బండి అద్దెకు చెల్లించాల్సి రావడం వల్ల వారి జీవనం మరింత భారంగా మారుతోందని పేర్కొన్నారు. సొంతంగా బండ్లు కొనుగోలు చేసే ఆర్థిక స్థోమత లేని వారికి సొంత తోపుడు బండ్లు అందిస్తే వారి ఉపాధికి తోడ్పాటు అందుతుందనే ఆలోచనతో ఎంపీ శ్రీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా ఈ కార్యక్రమాన్ని చేపట్టారని తెలిపారు. ఇప్పటికే తొలి విడతలో కోవూరు నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన 51 మంది లబ్ధిదారులకు తోపుడు బండ్లు పంపిణీ చేశామని, రెండో విడతలో మరో 41 మందికి అందజేస్తున్నామని ప్రశాంతి రెడ్డి వెల్లడించారు. ప్రతి తోపుడు బండి తయారీకి సుమారు రెండు నెలల సమయం పడుతుందని, బండి కావాలని విజ్ఞప్తి చేసిన వారి ఆర్థిక పరిస్థితులను పరిశీలించిన తర్వాత నిజంగా అవసరమైన వారిని ఎంపిక చేసి వీపీఆర్ ఫౌండేషన్ తరఫున అందజేస్తున్నామని చెప్పారు. లబ్ధిదారులంతా ఈ తోపుడు బండ్లను సద్వినియోగం చేసుకుని తమ వ్యాపారాలను అభివృద్ధి చేసుకుంటూ ఆర్థికంగా నిలదొక్కుకోవాలని, వారి కుటుంబాలు సంతోషంగా జీవించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు చెప్పారు

# ఓటర్ల సమగ్ర సవరణ కార్యక్రమం



చిలకలూరిపేట , పెన్ పవర్, జూలై 09: చిలకలూరిపేట : భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చిలకలూరిపేట నియోజకవర్గంలో ప్రత్యేక ఓటర్ల సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం చురుకుగా సాగుతోంది. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ తిరిగి ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేసి, పూర్తిచేసిన ఫారాలను స్వీకరించి ఆన్‌లైన్‌లో డిజిటలైజేషన్ చేస్తున్నారు. జూలై 9 సాయంత్రం నాటికి నియోజకవర్గంలో 99.99 శాతం (2,26,957) ఫారాల పంపిణీ పూర్తికాగా, 73.94 శాతం (1,67,806) ఫారాల డిజిటలైజేషన్ పూర్తయినట్లు ఎన్నికల ఓటర్ల నమోదు అధికారి బి. లీలారాణి ఒక ప్రకటనలో తెలిపారు. స్వచ్ఛమైన మరియు ఖచ్చితమైన ఓటరు జాబితా రూపకల్పనకు ప్రజలు తమ వివరాలు సరిచూసుకుని, అవసరమైన పత్రాలతో కూడిన ఫారాలను వెంటనే బీఎల్ఓలకు అందించి సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# చీరాలలో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత



చీరాల, పెన్ పవర్, జులై 09 విద్యుత్ మరమ్మత్తుల కారణంగా నేడు (జూలై 10) చీరాల పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా తాత్కాలికంగా నిలిపివేయనున్నట్లు ఆపరేషన్ డి2 సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ తెలిపారు.

ఉదయం 9:00 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంట వరకు: కృపానగర్, హస్తినాపురం, రామ్ రెడ్డి నగర్

మధ్యాహ్నం 2:00 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు: గంజిపాలెం, బోస్ నగర్, ప్రసాద్ థియేటర్ ఏరియా ఈ సమయంలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని, వినియోగదారులు సహకరించాలని అసిస్టెంట్ ఇంజనీర్ (ఆపరేషన్ డి2 సెక్షన్) విజ్ఞప్తి చేశారు.

# రూ. 4 లక్షలతో లేగుంటపాడు జడ్పీహెచ్ఎస్ పాఠశాల అభివృద్ధి

## పనులను పరిశీలించిన కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి
## -30 ఏళ్ల తర్వాత లేగుంటపాడు హైస్కూల్‌కు కొత్త రూపు
## సీఎస్ఆర్, వీపీఆర్ ఫౌండేషన్ నిధులతో మౌలిక వసతుల కల్పన
## నెల్లూరు ఎంపీ శ్రీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి దాతలకు ప్రత్యేక ధన్యవాదాలు





కోవూరు పెన్ పవర్ జులై 9. కోవూరు నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న పాఠశాలలను ప్రాధాన్యత క్రమంలో ముందుగా అభివృద్ధి చేస్తున్నామని కోవూరు శాసనసభ్యురాలు శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. కోవూరు మండలం, లేగుంటపాడు గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో సీఎస్ఆర్ ( సి ఎస్ ఆర్ ), వీపీఆర్ ఫౌండేషన్ నిధులు దాదాపు రూ. 4 లక్షలతో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను గురువారం ఉదయం ఆమె స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ... పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల మౌలిక వసతులను కల్పిస్తున్నామని చెప్పారు. నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండలాల్లో 150 మంది కంటే ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు ఉన్న పాఠశాలలను గుర్తించి, వాటికి మొదటి ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. ఇప్పటికే బుచ్చిరెడ్డిపాళెం మండలం దామరమడుగులో, కొడవలూరు మండలం రాజుపాళెంలో పాఠశాలల అభివృద్ధి పనులు విజయవంతంగా పూర్తి చేశామని, పడుగుపాడు పాఠశాలలో కూడా ప్రస్తుతం పనులు వేగంగా కొనసాగుతున్నాయని ఆమె తెలిపారు. లేగుంటపాడు జడ్పీహెచ్ఎస్ పాఠశాల గురించి మాట్లాడుతూ, దాదాపు 30 సంవత్సరాల తర్వాత ఈ పాఠశాల రూపురేఖలు మార్చడం సంతోషంగా ఉందన్నారు. ఇన్నేళ్ల కాలంలో మొదటిసారిగా పాఠశాల భవనాలకు కొత్తగా పెయింటింగ్ వేయించడంతో పాటు, విద్యార్థులకు అవసరమైన ఆధునిక మౌలిక వసతులను కల్పించామని చెప్పారు. ఈ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. పాఠశాలల అభివృద్ధికి వీపీఆర్ ఫౌండేషన్ తరఫున నిధులు మంజూరు చేస్తున్న నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అలాగే సీఎస్ఆర్ ఫండ్స్ అందిస్తూ తోడ్పాటునందిస్తున్న దాతలకు ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. నియోజకవర్గంలో ఎక్కడ ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలు జరిగినా స్థానిక నాయకులు ఉత్సాహంగా పాల్గొని, పనులను పర్యవేక్షిస్తూ విజయవంతం చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సుధాకర్, గోపి, వేణు మరియు పాఠశాల సిబ్బంది, గ్రామ ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

# గర్భిణులకు అవసరమైన పోషకాహారం, ఆరోగ్య పరీక్షలు, అవగాహన కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు చేయాలి -- జిల్లా కలెక్టర్ సి. యం.సాయికాంత్ వర్మ





గుంటూరు, పెన్ పవర్, జూలై9జిల్లాలో గర్భస్థ మరణాల నివారణకు వైద్యారోగ్య శాఖ, ఐసీడీఎస్ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ సంయుక్త బాధ్యత తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సి. యం.సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు.గర్భస్థ మరణాలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి గర్భిణికి నాణ్యమైన ప్రసూతి పూర్వ వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అధిక ప్రమాద గర్భిణులను (హై రిస్క్ ప్రెగ్నెన్సీ) ముందుగానే గుర్తించి ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని, అవసరమైన వైద్య సేవలు సకాలంలో అందేలా చూడాలని అన్నారు. గ్రామ, వార్డు స్థాయిలో ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రతి గర్భిణి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. గర్భిణులకు అవసరమైన పోషకాహారం, ఆరోగ్య పరీక్షలు, అవగాహన కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. జిల్లాలో గర్భస్థ మరణాల ప్రతి ఘటనను క్షుణ్ణంగా విశ్లేషించి, వాటి కారణాలను గుర్తించి పునరావృతం కాకుండా తక్షణ నివారణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. తల్లి, శిశు ఆరోగ్య పరిరక్షణలో నిర్లక్ష్యానికి తావు లేకుండా అన్ని శాఖలు సమిష్టిగా కృషి చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా. విజయలక్ష్మి , ఐసీడీఎస్ పిడి ప్రసూన, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# రామతీర్థం గ్రామంలో భక్తులకు ఉచిత అన్నప్రసాదం





నెల్లూరు రూరల్ (విడవలూరు) పెన్ పవర్, జూలై9 శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరు నియోజకవర్గం విడవలూరు మండలం రామతీర్థం లో వెలసిన కామాక్షి దేవి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా 04 వ రోజు వరబడిన భక్తులకు ఉచిత అన్న ప్రసాదం చేయనున్నట్లు దాతలు నాటారు వెంకయ్య తెలిపారు గత కొన్ని సంవత్సరాలుగా తాము ఈ సేవను చేస్తున్నామని ఈ సంవత్సరం కూడా వరవడిన భక్తులకు 10 రోజులపాటు ఉదయం అల్పాహారం మధ్యాహ్నం భోజనం సాయంత్రం భోజనాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు అలాగే వారికి అన్ని మౌలిక వసతులను కూడా కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు ఇందుకుగాను అశోక్ పి శ్రీనివాసులు కె శ్రీనివాసులు ఎన్ జితేంద్ర కె నరేష్ మణి పోలయ్య అర్చన ఎం వెంకయ్య సుబ్రహ్మణ్యం తదితరులు సహకారం అందిస్తున్నట్లు ఆయన తెలిపారు సహాయం ఎవరైనా చెయ్యాలనుకుంటే దాతలు ఉంటే నాటారు వెంకయ్య ను సంప్రదించండి ఫోన్ నెంబర్లు 9440988952 9515448952

# ఎపిఎఐఎంఎస్ యాప్ తోనే ఎరువులు పంపిణీ

## కౌలు రైతులు తప్పనిసరిగా సీసీఆర్సీ కార్డులు పొందాలి




పెన్ పవర్, జూలై9 చేబ్రోలు: చేబ్రోలు మండల పరిధిలోని సుద్దపల్లి గ్రామంలో రైతు సేవా కేంద్రం (ఆర్ఎస్‌కే)లో ఆత్మ (ఎటిఎంఎ) ఆధ్వర్యంలో రైతు అవగాహన సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశానికి ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ జి. వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా, డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్ టి. శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పొన్నూరు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు వి. రామకోటేశ్వరి,చేబ్రోలు వ్యవసాయ అధికారి వి. ప్రియదర్శిని హాజరయ్యారు.సమావేశాన్ని ప్రారంభించిన ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ జి. వెంకటేశ్వర్లు వరి పంటలో సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ అందించారు.రసాయన ఎరువులను అవసరమైన మోతాదులో మాత్రమే వినియోగిస్తూ, సేంద్రియ పద్ధతులను కూడా అనుసరించాలని రైతులకు సూచించారు.అలాగే తక్కువ వ్యవధిలో పండే పంటలను సాగు చేయడం ద్వారా వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించుకోవచ్చని రైతులకు అవగాహన కల్పించారు. డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్ టి. శ్రీనివాసరావు ప్రస్తుతం నెలకొన్న ఎల్‌నినో పరిస్థితులపై రైతులకు వివరించారు. వాతావరణ మార్పులకు తట్టుకునే వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని, పీఎండీఎస్ వినియోగం, పచ్చి ఎరువుల పంటల సాగు మరియు వాటిని సేంద్రియ ఎరువులుగా వినియోగించడం ద్వారా నేల సారాన్ని పెంపొందించుకోవచ్చని సూచించారు.పొన్నూరు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు వి. రామకోటేశ్వరి రైతులకు ఎపిఎఐఎంఎస్ యాప్ గురించి వివరించారు. ఖరీఫ్ 2026 నుండి యూరియా మరియు డీఏపీ ఎరువుల పంపిణీ ఈ యాప్ ద్వారా నిర్వహించబడుతుందని తెలిపారు.

# ఉత్సాహంగా ముగిసిన రాష్ట్రస్థాయి నాటిక పోటీలు

ఏలూరు రూరల్, పెన్ పవర్, జూలై9 ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక సాంస్కృతిక సమితి, ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ, హేలాపురి కళాపరిషత్, ఏలూరు సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి నాటిక పోటీలు నాలుగోరోజు మంగళవారం ఉత్సాహపరిచే వాతావరణంలో ముగిశాయి. చివరి రోజు ప్రదర్శించిన రెండు నాటికలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. సుమిత్ర ఓ పేద రైతు కుటుంబానికి కోడలు, భర్త వర్ధన్‌తో కలిసి పట్టణంలో నివసిస్తూ, మామయ్య కృష్ణమూర్తిని గౌరవంగా, మరదలు సౌజన్యను సొంత చెల్లెలిగా ప్రేమగా చూసుకుంటుంది. సౌజన్య పెళ్లి కోసం బంగారు గొలుసు కొనిపెట్టడం, మామయ్య స్నేహితుడి కంటి ఆపరేషన్‌కు ఆర్థిక సాయం చేయడం వంటి పనులు చేసి కుటుంబ సభ్యుల అభిమానాన్ని ఆమె చూరగొంటుంది. అన్యాహ్యంగా సౌజన్య తీవ్ర అనారోగ్యానికి గురవుతుంది. రక్తమార్పిడి చేసినా కొంతకాలం జీవించే అవకాశం ఉందని వైద్యులు చెప్పడంతో పరిస్థితి విషమిస్తుంది. అందరికీ సహాయం చేసిన సుమిత్ర మాత్రం సౌజన్య చికిత్స కోసం ఒక్క రూపాయి ఖర్చు చేయొద్దని అలా చేస్తే ఆత్మహత్య చేసుకుంటానని భర్తను హెచ్చరిస్తుంది.

# "సంకల్పం" కార్యక్రమం మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించిన పాత గుంటూరు పోలీసులు






గుంటూరు, పెన్ పవర్, జులై, 09, గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు ఈ రోజు ఉదయం 11.30 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు, గుంటూరు ఈస్ట్ ఇంచార్జ్ డీస్పీ అయిన డి. శ్రీనివాస రెడ్డి మరియు పాత గుంటూరు పోలీస్ స్టేషన్ సీఐ కె వెంకట ప్రసాద్ ఆధ్వర్యంలో కాకాని రోడ్డు లోని సిమ్స్ కళాశాలలో "సంకల్పం – మాదకద్రవ్యాలకు వ్యతిరేక పోరాటం" అనే అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక మరియు చట్టపరమైన దుష్పరిణామాలపై గుంటూరు ఈస్ట్ ఇంచార్జ్ డీస్పీ డి. శ్రీనివాస రెడ్డి అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తాయని, విద్యార్థులు చెడు స్నేహాలకు దూరంగా ఉండి చదువు, క్రీడలు మరియు సత్ప్రవర్తనపై దృష్టి సారించాలని సూచించారు. అలాగే, ఎట్టి పరిస్థితుల్లోనూ మాదకద్రవ్యాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని, తమ పరిసరాల్లో మాదకద్రవ్యాల విక్రయం లేదా వినియోగం అనుమానాస్పదంగా గమనించిన వెంటనే పోలీసులకు లేదా కళాశాల యాజమాన్యానికి సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, పాత గుంటూరు పోలీస్ స్టేషన్ పోలీసు సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు...

# తోటవారిపాలెంలో గోదాం నిర్మాణానికి ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య శంకుస్థాపన





చీరాల, పెన్ పవర్ జులై 09: బాపట్ల జిల్లా, చీరాల మండలం తోటవారిపాలెం గ్రామంలో చీరాల మండల వ్యవసాయ పరపతి సంఘం (పిఎ సి యస్ ) ఆధ్వర్యంలో నిర్మించనున్న వ్యవసాయ గోదాం నిర్మాణ పనులకు చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని అన్నారు. రైతులు పంటల సాగు నుంచి పంట విక్రయాల వరకు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తోందని తెలిపారు. రైతులు పండించిన ధాన్యం, ఎరువులు తదితర వ్యవసాయ ఉత్పత్తులను సురక్షితంగా నిల్వ చేసుకునేందుకు గోదాం నిర్మాణం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో చీరాల పి ఎ సి యస్ అధ్యక్షులు కోటి మోహన్ కృష్ణ, వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఎ యం సి) చైర్మన్ కౌతరపు జనార్ధన్, పందిళ్లపల్లి పి ఎ సి యస్ అధ్యక్షులు పల్లప్రోలు శ్రీనివాసరావు, సంబంధిత శాఖల అధికారులు, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# తప్పులు లేని, స్వచ్ఛమైన ఓటర్ల జాబితా కొరకు ప్రతి ఒక్కరూ సహకరించాలి: నగర కమిషనర్ మయూర్ అశోక్





గుంటూరు, పెన్ పవర్, జులై, 09, గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో తప్పులు లేని, అత్యంత స్వచ్ఛమైన ఓటర్ల జాబితాను రూపొందించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా సహకరించాలని గుంటూరు నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్ఓ కె.మయూర్ అశోక్ నగర ప్రజలను కోరారు. గురువారం కమిషనర్ బాలాజీ నగర్, ఎల్బీ నగర్, ఇశ్రాయేల్ పేట, ఆర్టీసి కాలనీల్లోని పలు పోలింగ్ కేంద్రాల పరిధిలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించి, బిఎల్ఓలు, సూపర్వైజరీ అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గత 25 రోజులుగా నగరంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా సాగుతోందని తెలిపారు. ఓటర్ల జాబితా ప్రక్షాళనలో భాగంగా చేపట్టిన కీలకమైన ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ ఇప్పటికే గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో 99 శాతం పూర్తయిందన్నారు. నగరం నుండి వేరే ప్రాంతాలకు వలస వెళ్లిన వారు, ఇళ్లు మారిన వారు (షిఫ్టెడ్), మరణించిన వారి (డెత్ కేసెస్) ఫారాలు మినహా, మిగిలిన అర్హులైన ఓటర్లందరికీ ఈ ఫారాలను విజయవంతంగా చేరవేసినట్లు పేర్కొన్నారు. ఓటర్ల నుంచి తిరిగి సేకరించిన ఎన్యుమరేషన్ ఫారాలను సకాలంలో ఆన్‌లైన్ (డిజిటలైజేషన్) చేసే ప్రక్రియను కూడా సమాంతరంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ప్రత్యేక ప్రక్రియ ముగియడానికి ఇంకా కేవలం 5 రోజులు మాత్రమే గడువు ఉందని, కాబట్టి ఎన్యుమరేషన్ ఫారాలు కలిగిన ఓటర్లందరూ ఆలస్యం చేయకుండా వాటిని వెంటనే మీ ప్రాంత పరిధిలోని బీఎల్ఓ కు అందించాలని కోరారు. ప్రజల సౌకర్యార్థం అన్ని సచివాలయాలు, నగరంలోని ప్రధాన కూడళ్లు, ప్రముఖ ప్రాంతాలలో ప్రత్యేక హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేశామని, గతంలో పోలింగ్ కేంద్రాల వద్ద కూడా నాలుగు రోజుల పాటు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను (స్పెషల్ క్యాంపెయిన్) నిర్వహించామని తెలిపారు. ఎవరైనా ఓటర్లు ఇంకా ఫారాలు అందజేయకపోతే, వారి కోసం జిఎంసి సిబ్బంది గురు, శుక్రవారాలు (రెండు రోజుల పాటు) మళ్లీ ప్రతి ఇంటికీ వచ్చి ఎన్యుమరేషన్ ఫారాలను సేకరిస్తారని వివరించారు. సిబ్బంది మీ ఇంటికి వచ్చినప్పుడు ఓటర్లు తమ ఫారాలపై తక్షణమే సంతకం చేసి అందిస్తే, వాటిని వెంటనే డిజిటైజ్ చేస్తామని చెప్పారు. ఒకవేళ ఎవరికైనా ఎన్యుమరేషన్ ఫారం అందక, పొరపాటున ఓటు తొలగింపునకు గురైతే ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని, వారికి మళ్లీ ఓటు హక్కు పొందేందుకు పూర్తి అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. అటువంటి వారు కొత్తగా ఓటు నమోదు కోసం ఫారం-6 ద్వారా లేదా ఒక నియోజకవర్గం నుండి వేరే నియోజకవర్గానికి, వివరాల మార్పుల కోసం ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. నగర ఓటర్లందరూ ఈ ప్రక్రియలో భాగస్వాములై, ఎలాంటి అపోహలు లేకుండా అధికారులకు సహకరించి గుంటూరు నగర ఓటర్ల జాబితాను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని కోరారు. పర్యటనలో ఏఈఆర్ఓలు మాధురి, మహ్మద్ రఫీ, సూపర్వైజరీ అధికారులు వెంకటేశ్వరరావు, హయషావలి, బిఎల్ఓలు పాల్గొన్నారు.

# మచిలీపట్నం అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం: కొల్లు రవీంద్ర



పెన్ పవర్, జూలై9 మచిలీపట్నం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. బందరు మండలం కానూరు శివారు చిన్న క్యాంప్ బెల్ గ్రామంలో నూతనంగా నిర్మించిన హెడ్ వాటర్ ట్యాంక్‌ను ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... గత ఐదేళ్ల వైసీపీ అరాచక పాలన వల్ల రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందని, ప్రతిపక్షాల పసలేని విమర్శలను తాము పట్టించుకోబోమని మండిపడ్డారు. బందరు గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరు అందించేందుకు జలజీవన్ మిషన్ కింద రూ. 200 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. అలాగే, ఈ ప్రాంత రూపురేఖలను మార్చే ప్రతిష్ఠాత్మక 'బందరు పోర్టు' పనులను మరింత వేగవంతం చేసి, వచ్చే ఏడాది ఆరంభంలోనే ప్రారంభిస్తామని మంత్రి ప్రకటించారు. దీని ద్వారా మచిలీపట్నం పారిశ్రామికంగా ఎదిగి, స్థానిక యువతకు పెద్దపీట వేస్తూ ఉపాధి అవకాశాలు లభిస్తాయని కొల్లు రవీంద్ర ధీమా వ్యక్తం చేశారు.

# ఎన్యుమషనను త్వరగా పూర్తి చేయండి

కర్నూలు న్యూసిటీ, పెన్ పవర్,జూలై09 ప్రతి ఓటరు ఎన్యుమరేషన ప్రక్రియను త్వరగా పూర్తి చేసుకోవాలని కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి(ఈఆర్ఓ), నగర పాలక కమిషనర్ చల్లా ఓబు లేసు విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన 234, 235, 236, 246 పోలింగ్ కేంద్రాల పరిధిలోని పాతబస్తీ, గడ్డ వీధి, నాగులకట్ట, ఈద్గా వీధి తదితర ప్రాంతాల్లో 'సర్'పై ఓటర్లకు అవగాహన కల్పించారు. ఏఈఆర్ఓలు, సూప ర్‌వైజర్లు, బీఎల్ఓలు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి మైక్ ద్వారా ఇంటింటికి తిరుగుతూ 'సర్'పై అవగాహన కల్పించారు. ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తూ సర్ ప్రక్రియ ఆవశ్యకతను వివరించారు. అలాగే ఈ నెల 11, 12 తేదీల్లో అన్ని పోలింగ్ కేంద్రాల్లో నిర్వహించనున్న ప్రత్యేక శిబిరాలపై ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎవరికైనా ఎన్యుమరేషన ఫారం అందకపోతే భారత ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్‌లో తమ ఓటరు గుర్తింపు సంఖ్య నమోదు చేయడం ద్వారా సంబంధిత బీఎల్ఓ పేరు, ఫోన నెంబరు తెలుసుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో ఏఈఆర్ఓ డిప్యూటీ కమిషనర్ సతీష్‌కుమార్‌రెడ్డి, సూపర్ వైజర్లు మంజూర్ బాషా, వాజిద్, మన్సూర్, శానిటరీ ఇనస్పెక్టర్లు రాజు, ఇంతియాజ్ పాల్గొన్నారు.

# మొబైల్ లో లీనమయ్యాడు మృత్యువు ఒడిలోకి జారిపోయాడు



విజయవాడ, పెన్ పవర్, జులై, 09, విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండ్‌లో చోటుచేసుకున్న ఒక ఘోర ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది. అవనిగడ్డ ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు బస్టాండ్ నుండి బయటకు వస్తున్న సమయంలో.. చీరాలకు (బొర్రా వారి పాలెం) చెందిన బొర్రా గిరీష్ తన మొబైల్ ఫోన్ స్క్రీన్‌ను చూసుకుంటూ, పూర్తిగా అందులోనే మునిగిపోయి నడుస్తూ, బస్సు వస్తున్న విషయాన్ని గమనించకుండా దానికి అడ్డంగా వెళ్ళిపోయాడు. దాంతో అతను అప్రమత్తమయ్యే లోపే బస్సు చక్రాల కింద పడిపోవడంతో, భారీ చక్రాలు అతనిపై నుంచి దూసుకెళ్లి అక్కడికక్కడే అత్యంత దారుణంగా ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఊహించని ఘటనతో బస్టాండ్‌లో ఒక్కసారిగా కలకలం రేగగా, సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా ఆ వ్యక్తి ఫోన్ చూస్తూ అజాగ్రత్తగా వెళ్లడం వల్లే ప్రమాదం జరిగిందని ప్రాథమికంగా గుర్తించిన పోలీసులు వ్యక్తి మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి, ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవర్ ను అదుపులోకి తీసుకున్నారులి

# సోషల్ మీడియాతో పాటు ప్రజా పోరాటాలను ఉధృతం చేయాలి ముప్పాళ్ల నాగేశ్వరరావు





గుంటూరు, పెన్ పవర్, జులై, 09, ప్రజలకు వాస్తవాలను చేరవేసేందుకు సోషల్ మీడియాను సమర్థవంతంగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.మారుతున్న సామాజిక, రాజకీయ పరిస్థితుల్లో ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేసే శక్తిగా సోషల్ మీడియా ఎదిగిందని, అలాంటి వేదికలను ప్రజా ప్రయోజనాల కోసం వినియోగించడం నేటి అవసరమని ఆయన పేర్కొన్నారు. సోషల్ మీడియా ద్వారా ప్రజల సమస్యలు, ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు, కార్మికులు, రైతులు, యువత, మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వాస్తవాధారాలతో ప్రజలకు చేరవేయాలని సూచించారు. అసత్య ప్రచారాలను సమర్థవంతంగా తిప్పికొట్టేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సకాలంలో స్పందిస్తూ ప్రజల్లో అవగాహన పెంపొందించే బాధ్యతను నిర్వర్తించాలని అన్నారు.కేవలం సోషల్ మీడియాలో ప్రచారం చేయడం మాత్రమే సరిపోదని, ప్రజల మధ్యకు వెళ్లి వారి సమస్యలపై ప్రత్యక్షంగా ఉద్యమాలు నిర్వహించడం కూడా అంతే ముఖ్యమని ముప్పాళ్ల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో జరిగే ప్రచారానికి క్షేత్రస్థాయి ప్రజా పోరాటాలు జతకావడంతోనే ప్రజల విశ్వాసం మరింత బలపడుతుందని పేర్కొన్నారు.పార్టీ నాయకులు, కార్యకర్తలు సోషల్ మీడియాను ప్రజా చైతన్యానికి ప్రధాన ఆయుధంగా మలుచుకోవడంతో పాటు గ్రామాలు, పట్టణాల్లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలను మరింత ఉధృతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతూ వారి గొంతుకగా నిలవడమే కమ్యూనిస్టు ఉద్యమం లక్ష్యమని ముప్పాళ్ళ నాగేశ్వరరావు స్పష్టం చేశారు.

సోషల్ మీడియాను ప్రజా చైతన్యానికి ప్రధాన ఆయుధంగా మలచాలి:

సోషల్ మీడియా వినియోగంలో సీపీఐ వెనుకబడి ఉందని వ్యాఖ్య కార్పొరేట్ ఆధీనంలో ప్రధాన మీడియా ప్రశ్నించే వారిపై ఉపా చట్టం ప్రయోగించడం ప్రజాస్వామ్యానికి విఘాతమని విమర్శ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు,, సిపిఐ సోషల్ మీడియా ఇన్చార్జి హరినాథ్ రెడ్డి ప్రస్తుత కాలంలో ప్రజల ఆలోచనలు, అభిప్రాయాలను ప్రభావితం చేయడంలో సోషల్ మీడియా అత్యంత కీలక పాత్ర పోషిస్తోందని సీపీఐ నాయకుడు హరినాథ్ రెడ్డి అన్నారు. గురువారం గుంటూరు నగరంలోని సిపిఐ కార్యాలయంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి అధ్యక్షతన జరిగిన సోషల్ మీడియా వారియర్స్ వర్క్ షాప్ లో ఆయన మాట్లాడుతూ సోషల్ మీడియాను సమర్థంగా వినియోగించుకోవడంలో భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఇంకా వెనుకబడి ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.సాంకేతిక పరిజ్ఞానం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు పెంపొందించుకోవడానికి, పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సమస్యలు, ఉద్యమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడానికి సోషల్ మీడియా అత్యంత ప్రభావవంతమైన వేదికగా మారిందన్నారు. సీపీఐ నాయకులు, కార్యకర్తలు సోషల్ మీడియాను తమ ప్రధాన ఆయుధంగా మలుచుకుని ప్రజా చైతన్యానికి సమర్థంగా వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.ప్రస్తుతం దేశంలోని ప్రధాన మీడియా సంస్థల్లో అధిక భాగం కార్పొరేట్ సంస్థల ఆధీనంలోకి వెళ్లడంతో ప్రజల సమస్యలకు తగిన ప్రాధాన్యం దక్కడం లేదని హరినాథ్ రెడ్డి విమర్శించారు.కార్పొరేట్ ప్రయోజనాలకే పెద్దపీట వేయడం వల్ల సామాన్య ప్రజల సమస్యలు, కార్మికులు, రైతులు, అణగారిన వర్గాల గొంతుక ప్రధాన స్రవంతి మీడియాలో మరుగున పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వాలను ప్రశ్నించే జర్నలిస్టులు, మీడియా సంస్థలు, ప్రజాస్వామ్యవాదులు, సామాజిక కార్యకర్తలపై అధికారంలో ఉన్న పార్టీలు కఠిన చట్టాలను ప్రయోగించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా ఉపా చట్టాన్ని ప్రశ్నించే వారిపై ప్రయోగించడం మీడియా గొంతు నొక్కే చర్యేనని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలను గౌరవించడం, విమర్శలను స్వీకరించడం ప్రభుత్వాల బాధ్యత అని, విభేదించే స్వరాలను అణచివేయడం రాజ్యాంగం కల్పించిన భావ వ్యక్తీకరణ స్వేచ్ఛకు విఘాతం కలిగిస్తుందని హరినాథ్ రెడ్డి అన్నారు.ప్రజా సమస్యలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించేందుకు, ప్రజా చైతన్యాన్ని మరింత విస్తరించేందుకు సీపీఐ నాయకులు, కార్యకర్తలు సోషల్ మీడియాను సమర్థవంతంగా వినియోగించాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్, నగర కార్యదర్శి ఆకిటి అరుణ్ కుమార్, జిల్లా సహాయ కార్యదర్శులు చిన్ని తిరుపతయ్య, మేడా హనుమంతరావు పాల్గొనగా, రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు నాగరాజు సోషల్ మీడియా ద్వారా ప్రజా సమస్యలపై ఏవిధంగా సిపిఐ కార్యక్రమాలను ప్రజల్లో తీసుకెళ్లాలో సామాజిక మాధ్యమాల యాప్ ల గురించి వివరించారు.. సిపిఐ సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ ఎం. సాయి కుమార్ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

# చీరాల యూపీహెచ్ సి లో గర్భిణీలు, బాలింతలకు ఉచిత పోషణ్ కిట్ల పంపిణీ




చీరాల, పెన్ పవర్, జూలై 09: చీరాల మండలం పరిధిలోని పాపరాజుతోట అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్ సి )లో గర్భిణీలు, బాలింతలకు ఉచిత పోషణ్ కిట్లను పంపిణీ చేశారు.బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గ ప్రజల ఆరోగ్య సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టిన బాపట్ల పార్లమెంట్ సభ్యులు, లోక్‌సభ ప్యానల్ స్పీకర్ తెన్నేటి కృష్ణప్రసాద్ చొరవను లబ్ధిదారులు అభినందించారు. అందించిన పోషకాహార కిట్లు తమ ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడతాయని పేర్కొంటూ ఎంపీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణమే లక్ష్యంగా బాపట్ల పార్లమెంటరీ నియోజకవర్గవ్యాప్తంగా పోషకాహార కిట్ల పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది.ఇందులోభాగంగా చీరాల యూపీహెచ్ సిలో నిర్వహించిన కార్యక్రమంలో అర్హులైన గర్భిణీలు, బాలింతలకు కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమాన్ని గెయిల్ (ఇండియా) లిమిటెడ్ సీఎస్ఆర్ నిధుల మద్దతుతో అవంత్ ఫౌండేషన్ మరియు కృష్ణప్రసాద్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించాయి. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, నిర్వాహకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# నవజ్యోతి కాలనీలో మహిళ మృతి.. భర్తపై కుమారుడి సంచలన ఆరోపణ

## మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ప్రభుత్వ వైద్యశాలకు తరలింపు,, అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టిన పోలీసులు

వేటపాలెం, పెన్ పవర్, జులై 09 వేటపాలెం మండలం దేశాయిపేట పంచాయతీ పరిధిలోని నవజ్యోతి కాలనీలో ఓ మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం స్థానికంగా కలకలం రేపింది. మృతురాలిని అన్నపరెడ్డి వీరమ్మ (అలియాస్ ఆషా)గా గుర్తించారు. మృతురాలి కుమారుడు షారుక్ ఖాన్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో, తన తండ్రి షేక్ రఫీ మెడకు వైరు బిగించి తన తల్లిని హత్య చేశాడని ఆరోపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ఆధారాలను సేకరించి కేసు నమోదు చేశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఘటనాస్థలాన్ని చీరాల డీఎస్పీ ఎం.డి. మోయిన్, రూరల్ సీఐ సుధాకర్, ఎస్ఐ జనార్ధన్ సందర్శించి పరిశీలించారు. ఘటనకు సంబంధించిన అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోందని, పూర్తి వివరాలు విచారణ అనంతరం వెల్లడిస్తామని తెలిపారు. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం షేక్ రఫీ మద్యానికి బానిసై తరచూ భార్యతో గొడవపడుతూ ఆమెపై దాడులకు పాల్పడేవాడని ఆరోపిస్తున్నారు. ఇటీవల కుటుంబ కలహాలు తీవ్రస్థాయికి చేరుకుని పలుమార్లు వీరమ్మపై దాడి జరిగినట్లు తెలిపారు. ఈ విషయాలను వీరమ్మ తన కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా తెలియజేస్తూ ఆవేదన వ్యక్తం చేసేదని పేర్కొన్నారు. గ్రామస్తుల వివరాల ప్రకారం, వీరమ్మకు తొలి భర్త అన్నపరెడ్డి శ్రీను ద్వారా ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తొలి భర్త మరణించిన అనంతరం సుమారు 11 సంవత్సరాల క్రితం షేక్ రఫీని వివాహం చేసుకుంది. ఈ దంపతులకు షారుక్ ఖాన్ అనే కుమారుడు ఉన్నాడు. రఫీ ఆటో నడుపుతూ జీవనం సాగించడంతో పాటు ఆదివారాల్లో చికెన్ దుకాణంలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. తల్లి మృతితో షారుక్ ఖాన్ తీవ్ర విషాదంలో మునిగిపోయాడు. తన తండ్రే తల్లిని హత్య చేశాడని ఆరోపిస్తూ కన్నీరుమున్నీరుగా విలపించాడు. అయితే ఈ ఘటనకు



గల అసలు కారణాలు పోస్టుమార్టం నివేదిక, ఫోరెన్సిక్ ఆధారాలు, పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. ప్రస్తుతం అన్ని కోణాల్లో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు

# ప్రజలకు ప్రతినిత్యం అందుబాటులో ఉండండి ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, పెన్ పవర్, జులై, 09, ప్రజలకు క్షేత్రస్థాయిలో ఎలాంటి సమస్యలు ఎదురవుతున్నాయో పరిశీలించి పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ సూచించారు. గురువారం స్థానిక తూర్పు కార్యాలయంలో కూటమి అబ్జర్వర్లు, క్లస్టర్ ఇన్చార్జులుతో ఎమ్మెల్యే నసీర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అన్ని డివిజన్లలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గంలో అన్ని ప్రాంతాలలో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి ప్రథమ ప్రాధాన్యత ఇచ్చామని తెలిపారు. వర్షాకాలం నేపథ్యంలో డ్రైనేజీ సమస్య అధికంగా ఉంటుందని, దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. లోతట్టు ప్రాంతాలను గమనించి అక్కడ ఎలాంటి అవసరాలు ఉన్నాయో గుర్తించాలన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో రూ. 350 కోట్లతో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. డ్రెయిన్లు, రోడ్ల నిర్మాణానికి రూ. 100 కోట్ల వరకు వెచ్చించినట్లు చెప్పారు. ప్రస్తుతం జరుగుతున్న పనుల నాణ్యత, పారదర్శకతను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ప్రజలకు ఏ చిన్న అవసరం వచ్చినా తమ కార్యాలయాన్ని ఎప్పుడైనా సంప్రదించవచ్చని సూచించారు. కూటమి నాయకులు ప్రజలకు



నిత్యం అందుబాటులో ఉండాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్ కార్యక్రమానికి కొద్దిరోజులు మాత్రమే గడువు ఉందని, దీనికి సంబంధించి బీఎల్వోలకు కూటమి నాయకులు సహకారం అందించాలని సూచించారు.

# దళితుల పోరాట ఫలితమే క్రాంతి మాదిగ కేసులో బలవన్మరణం ఎస్సీ ఎస్టీ యాక్ట్ సెక్షన్లు మార్చిన కూటమి ప్రభుత్వం

## క్రాంతి కేసులో కూడా సీఐ నాగరాజు మరియు టాస్క్ ఫోర్స్ పోలీసులను అరెస్టు చేయాలి

## క్రాంతి కుమార్ కేసు పై జ్యూడిషియల్ విచారణ కు ప్రభుత్వం ఆదేశించాలి దళిత నేత నీలం డిమాండ్

చీరాల, పెన్ పవర్, జూలై 09: దళితుల పోరాట ఫలితంగా విజయవాడ క్రాంతి మాదిగ అనుమానాస్పద మృతి కేసుని బలవన్మరణం ఎస్సీ ఎస్టీ కేసుగా కృష్ణలంక సీఐ నాగరాజు టాస్క్ ఫోర్స్ తదితర పోలీసులపై సెక్షన్లు మార్పించామని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు హర్షం వ్యక్తం చేశారు. గురువారం చీరాల అంబేద్కర్ భవన్ లో విలేకరుల సమావేశంలో

నీలం నాగేంద్రం మాట్లాడుతూ

కూటమి ప్రభుత్వం మెడలు వంచి రెండు వారాలలో విజయవాడ కృష్ణలంకలో పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగరాజు వేధింపులు అవమానాలు చిత్రహింసలు తట్టుకోలేక బలవన్మరణం చెందిన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు కుమారుడు పేరుపోగు క్రాంతి కుమార్ కేసును అనుమానాస్పద మరణం నుండి బలవన్మరణం మరియు ఎస్సీ ఎస్టీ యాక్ట్ లుగా విజయవాడ ఉత్తర ఏసిపి సత్యానంద్ మార్చారన్నారు. విజయవాడ కృష్ణలంక పోలీస్ స్టేషన్లో క్రైమ్ నెంబర్ 87/26 నెంబర్తో మే 22వ తేదీన క్రాంతి కుమార్ బలవన్మరణం సెక్షన్ 194 గా కేసు నమోదైనది అన్నారు. దళితుల పోరాట ఫలితంగా ఈ కేసును ఎస్సీ ఎస్టీ యాక్ట్ 3(2)(వి) గా మార్చారన్నారు.




పేరుపోగు క్రాంతికుమార్ తాను మాదిగ కులానికి చెందిన వాడనని తనతో బూట్ పాలిష్ చేయిస్తున్నారని బూట్ పాలిష్ రాదు అని చెబుతుంటే చెప్పులు కుట్టుకొని బతికే మాదిగోడివి బూత్ పాలిష్ రాదు అంటే మేము నమ్మాలంట్రా అంటూ కృష్ణలంక సీఐ నాగరాజు అవమానించాడన్నారు. అలాగే తనను గొడ్డును బాదినట్టు దారుణంగా కొట్టేవారని బాత్రూంలు కడిగించేవారని మనోవేదన చెందాడు తాము గంజాయి స్మగ్లర్ దగ్గర పట్టుకున్న గంజాయిని బయటి వాళ్లకు అమ్మి పెట్టాలని గంజాయి అమ్మకపోయినా అమ్మాయిలతో వ్యభిచారం చేయించే డబ్బులు తెచ్చి ఇవ్వాలని బెదిరించాడన్నారు. తాను కృష్ణలంక సీఐ చెప్పిన పనులు చేయకపోవడంతో తప్పుడు కేసులు పెడతానని సీఐ నాగరాజు వేధింపులపై క్రాంతి కుమార్ తల్లి మరియమ్మకు చెప్పి బాధపడ్డాడు ఈ విషయం ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు తండ్రి అయిన పేరుపోగు వెంకటేశ్వరరావు కి చెబితే పోలీసులు ఇంకా కక్ష పెంచుకొని తనను చంపేస్తారేమోనని క్రాంతి కుమార్ భయపడి తండ్రికి కూడా చెప్పవద్దని తల్లి మరియమ్మ దగ్గర మాట తీసుకున్నాడు అన్నారు. క్రాంతి కుమార్ మీద సస్పెక్ట్ షీట్ ఉండటంతో కృష్ణలంక పోలీసులు వారానికి ఒకసారి ఇంటికి వస్తూ పోతు మే 21వ తేదీన కూడా వచ్చి భయపెట్టారు. అంతట క్రాంతి మాదిగ ఇంట్లోకి వెళ్లి గుళికల మందు తాగి తన చావుకి సిఐ నాగరాజు ఖాకీ చిత్రహింసలు వేధింపులు అవమానాలు కారణంగా చనిపోతున్నానంటూ సెల్ఫీ వీడియో తీసుకొని బలవన్మరణం చెందాడు ఈ విషయం తెలియక క్రాంతి కుమార్ శవాన్ని పోస్టార్టం చేయించి ఖననం చేశారు. క్రాంతి కుమార్ జ్ఞాపకార్థ కూడిక తర్వాత సెల్ ఫోన్లో సిఐ నాగరాజు అరాచకం బయటపడటంతో తండ్రి పేరు పోగు వెంకటేశ్వరరావు విజయవాడ కమిషనర్ కు క్రాంతి కుమార్ మాదిగ బలవన్మరణం సెల్ఫీ వీడియో మరియు కృష్ణలంక సీఐ తదితర పోలీస్ అధికారులపై ఫిర్యాదు చేశారు. దళితుల పోరాట ఫలితంగా అలాగే ప్రతిపక్ష నేత వైసీపీ అధ్యక్షుడు జగన్ క్రాంతి మాదిగ ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులను పరామర్శించడంతో కూటమి ప్రభుత్వం కంగు తిన్నది . అలాగే దళితులు నిరంతరం సమావేశాలు ఆందోళనలు చేస్తూ కూటమి ప్రభుత్వానికి కునుకు లేకుండా చేశారన్నారు. శవం కనిపించని రౌడీ షీటర్ గాదె సాయి కృష్ణ కేసులో రాజమండ్రి జైలులో ఉన్న కృష్ణలంక సీఐ నాగరాజును క్రాంతి కుమార్ బలవన్మరణం మరియు ఎస్సీ ఎస్టీ కేసులో కూడా అరెస్టు చేసి విచారించాలని పెద్ద మాదిగను అని చెప్పుకుంటున్న చంద్రబాబు క్రాంతి కుమార్ కేసులో కూడా సిట్ వేసి విచారణ జరిపించాలని నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. క్రాంతి కుమార్ కేసులో ఇంతవరకు సిట్ వెయ్యలేదన్నారు. క్రాంతి కుమార్ కేసులో చంద్రబాబు కుల విభక్ష చూపిస్తున్నందున కాపు సాయి కృష్ణ కేసులో చూపిస్తున్న ప్రభుత్వ ప్రేమ క్రాంతికుమార్ మాదిగ కేసులో కూటమి ప్రభుత్వం చూపించినందున క్రాంతికుమార్ మాదిగ కేసులో హైకోర్టు జడ్జి చే జ్యూడిషియల్ విచారణ జరిపించాలని నీలం నాగేంద్ర డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు కాకుమాను రవి, పత్రా బంగారం, మేడికొండ మురళి, బుజ్జిబాబు పాల్గొన్నారు.

# షిర్డీ సాయినాథుని మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ దంపతులు

చిలకలూరిపేట , పెన్ పవర్, జూలై 09: చిలకలూరిపేట : రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ తన సతీమణితో కలిసి గురువారం చిలకలూరిపేట పట్టణంలోని షిర్డీ సాయినాథుని ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య దంపతులకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు అందజేసి తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం భాష్యం రామకృష్ణ దంపతులు, డీఎస్పీ హనుమంతరావుతో కలిసి పట్టణానికి చెందిన తమ చిరకాల మిత్రుడు కంచర్ల శ్రీనివాసరావు నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా కంచర్ల శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు వారికి ఘన స్వాగతం పలికి సత్కరించారు. ఈ సందర్భంగా



కంచర్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ, గత 25 సంవత్సరాలుగా భాష్యం రామకృష్ణ కుటుంబంతో తమకు సన్నిహిత స్నేహబంధం కొనసాగుతోందని తెలిపారు. రాజ్యసభ సభ్యునిగా ఎన్నికైన అనంతరం తొలిసారిగా భాష్యం రామకృష్ణ దంపతులు తమ నివాసానికి విచ్చేయడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. వారి రాక తమ కుటుంబానికి చిరస్మరణీయమైన సందర్భంగా నిలిచిపోతుందని హర్షం వ్యక్తం చేశారు.

# పౌష్టికాహారంపై ఫుడ్ కమిషన్ సభ్యులు ప్రత్యేక తనిఖీలు

చిలకలూరిపేట , పెన్ పవర్, జూలై 09: చిలకలూరిపేట : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు జె. కృష్ణ కిరణ్ చిలకలూరిపేటలో రెండు రోజుల పర్యటన చేపట్టారు. ఈ పర్యటనలో భాగంగా పట్టణంలోని మద్ది నగర్ లో గల అంగన్వాడీ కేంద్రాన్ని ఆయన సందర్శించి తనిఖీ చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. విద్యార్థులకు అందుతున్న పౌష్టికాహారం, వసతులపై పలు కీలక విషయాలను వెల్లడించారు. తన రెండు రోజుల పర్యటనలో భాగంగా అంగన్వాడీ కేంద్రాలు, రేషన్ షాపులు, ప్రాథమిక మరియు ఉన్నత పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం, అలాగే అన్ని సంక్షేమ వసతి గృహాలను (హాస్టళ్లను) తనిఖీ చేస్తున్నట్లు కృష్ణ కిరణ్ తెలిపారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి భోజనం నాణ్యతపై ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నామని, ఎక్కడైనా ఫుడ్ విషయంలో నాణ్యతా లోపాలు ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. నిన్నటి వరకు బాపట్ల జిల్లాలో పర్యటించి, విద్యార్థులు మరియు




హాస్టల్ వార్డెన్ల నుంచి కూడా సమాచారం సేకరించినట్లు ఆయన పేర్కొన్నారు.


ముఖ్యంగా ప్రభుత్వానికి మీడియా ముఖంగా ఒక విన్నపం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. 2002వ సంవత్సరం నాటి ధరలతో పోలిస్తే ప్రస్తుతం నిత్యావసర వస్తువుల ధరలు, ముఖ్యంగా చికెన్ లాంటి వాటి ధరల్లో చాలా వ్యత్యాసం ఉందన్నారు. కానీ హాస్టల్ విద్యార్థులకు అందించే డైట్ ఛార్జీలు ఆ స్థాయిలో పెరగలేదని ఆయన గుర్తుచేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా సంవత్సరానికి కనీసం వంద రూపాయల చొప్పున విద్యార్థుల భోజన ఛార్జీలను (మెస్ ఛార్జీలు) పెంచాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. పిల్లలకు పౌష్టికాహారం అందించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నామని, అందుకే నేరుగా పిల్లల నుంచే ఫీడ్ బ్యాక్ తీసుకుని వారి తరఫున ఈ విన్నపాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నామని ఆయన అన్నారు. ఛార్జీలు పెంచితే విద్యార్థులకు మరింత నాణ్యమైన, మెరుగైన భోజనం అందించడానికి వసతి గృహాల వార్డెన్లకు అవకాశం ఉంటుందని కృష్ణ కిరణ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# భాష్యం ఎంపికతో కూటమి ప్రభుత్వం, ప్రజాభిప్రాయానికి విలువనిచ్చింది : ప్రత్తిపాటి

## రాజ్యసభ సభ్యునిగా సాయినాథుని మొక్కులు చెల్లించుకున్నా: భాష్యం రామకృష్ణ

## గురుపౌర్ణమి ప్రచార కరపత్రాలు ఆవిష్కరించి, భక్తులకు అన్నవితరణ చేసిన ఎమ్మెల్యే, ఎంపీ.

## నిబద్ధత, క్రమశిక్షణ, అంకితభావం కలిగిన ప్రముఖ విద్యావేత్త రామకృష్ణకు టీడీపీ సముచిత స్థానం కల్పించింది : ప్రత్తిపాటి





చిలకలూరిపేట , పెన్ పవర్, జూలై 09: చిలకలూరిపేట : నిబద్ధత, అంకితభావం, క్రమశిక్షణ కలిగిన భాష్యం విద్యాసంస్థల అధినేత, భాష్యం రామకృష్ణను రాజ్యసభకు ఎంపిక చేయడం ద్వారా కూటమిప్రభుత్వం ప్రజాభిప్రాయానికి విలువనిచ్చిందని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. గురువారం ఆయన రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణతో కలిసి చిలకలూరిపేటలోని షిర్డీ సాయినాథుని మందిరంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఇరువురూ ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేసి, గురుపౌర్ణమి ప్రచార కార్యక్రమాల కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమాలు ముగిశాక ఎమ్మెల్యే, ఎంపీ విలేకరులతో మాట్లాడారు.

రామకృష్ణ చేతల మనిషి : ప్రత్తిపాటి

ప్రముఖ విద్యావేత్త భాష్యం రామకృష్ణను పెద్దల సభకు ఎంపిక చేయడం ద్వారా టీడీపీ సముచిత నిర్ణయం తీసుకుందని, ఆయన రాకతో పార్టీకి ప్రత్యేక గుర్తింపు, బలం చేకూరుతాయని ప్రత్తిపాటి అభిప్రాయపడ్డారు. రామకృష్ణ చేతల మనిషని, గతంలో తుపాను బాధితుల్ని ఆదుకోవడంలో ఆయనే తొలి అడుగు వేశారని ప్రత్తిపాటి చెప్పారు. తాను, రామకృష్ణ ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి కోటిరూపాయల ఆర్థిక సాయాన్ని తుపాను బాధితులకు అందించడం జరిగిందన్నారు. చిలకలూరిపేటపై రామకృష్ణకే ప్రత్యేక అభిమానముందని, ఇక్కడి ప్రజల్ని ఆయన తన మనుషులుగా చూస్తారని ప్రత్తిపాటి చెప్పారు.

చిలకలూరిపేట ప్రజలతో నాకు ప్రత్యేక అనుబంధం : భాష్యం రామకృష్ణ

రాజ్యసభకు ఎంపికైతే.. స్థానిక షిర్డీ సాయినాథుని మందిరంలో అన్నదానం చేయిస్తానని మొక్కుకున్నానని, నేడు ఎమ్మెల్యే ప్రత్తిపాటితో కలిసి ఆ మొక్కు తీర్చుకున్నానని రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ తెలిపారు. చిలకలూరిపేట నియోజకవర్గం, ప్రజలతో నాకు ప్రత్యేక అనుబంధం ఏర్పడిందని, ఎంపీగా ఎన్నికయ్యాక నాలుగుసార్లు నియోజకవర్గానికి రావడం జరిగిందని రామకృష్ణ చెప్పారు. సాయినాథుని ఆశీస్సులతో ప్రజలకు, రాష్ట్రానికి మేలు జరగాలని, అమరావతి, పోలవరం నిర్మాణాలు వేగంగా పూర్తై, చంద్రబాబు అభివృద్ధి ఫలాలు త్వరలోనే ప్రజలకు అందాలని రామకృష్ణ ఆకాంక్షించారు.

కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, ఆలయ చైర్మన్ కరణం చల్లా విజయ్ కుమార్, ప్రత్తిపాటి ఫౌండేషన్ నిర్వాహకులు కంచర్ల శ్రీనివాసరావు, టీడీపీ నేతలు గట్టినేని రమేష్, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, ఆలయ నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా సవరణ ఫారాలు సమర్పించకుంటే ఓటు గల్లంతే!

## ప్రజలకు మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరి బాబు విజ్ఞప్తి

చిలకలూరిపేట , పెన్ పవర్, జూలై 09: చిలకలూరిపేట : మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరి బాబు ఓటర్ల జాబితా సవరణపై పట్టణ ప్రజలకు కీలక సూచనలు చేశారు. జూన్ 15 నుంచి జూలై 14 వరకు కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమం జరుగుతోందని ఆయన తెలిపారు. ఈ క్రమంలో బీఎల్ఓలు పంపిణీ చేసిన ఎన్యుమరేషన్ ఫారాలను ఓటర్లు తీసుకున్నారు కానీ, ఇంకా చాలా మంది వాటిని పూర్తి చేసి తిరిగి ఇవ్వలేదని పేర్కొన్నారు. ఇలా ఫారాలు సమర్పించకపోతే భవిష్యత్తులో ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. ఫారాలు సమర్పించేందుకు జూలై 14 ఆఖరి తేదీ అని స్పష్టం చేశారు. ఫారం పైనే సంబంధిత బీఎల్ఓ పేరు, ఫోన్ నంబర్ ఉంటాయని, వారికి ఫోన్ చేసి ఫారాలు



అందించాలని కోరారు. ఒకవేళ ఫారం నింపడం రాకపోతే బీఎల్ఓనే స్వయంగా నింపుతారని, అలాగే ప్రతి బీఎల్ఓకు సహాయంగా ఇద్దరు హెల్పర్లను కూడా నియమించినట్లు తెలిపారు. చిలకలూరిపేట పట్టణంలో ఇప్పటివరకు కేవలం 65 శాతం మాత్రమే ఎన్రోల్మెంట్/డిజిటలైజేషన్ పూర్తయిందని, ఇంకా చాలా పని పెండింగ్లో ఉందని వెల్లడించారు. కుటుంబంలో ఎవరైనా మరణించినా, లేదా వేరే ప్రాంతాలకు నివాసం మార్చినా ఆ వివరాలను వెంటనే బీఎల్ఓలకు తెలియజేయాలని సూచించారు. డూప్లికేట్ ఓట్లు (రెండు చోట్ల ఓటు) ఉన్నవారు, తమకు అవసరమైన ఒక చోట ఉంచుకుని, రెండో దానిని తప్పనిసరిగా తొలగించుకోవాలని, రెండు చోట్ల ఓటు ఉంచుకోవడానికి వీల్లేదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో పౌరులంతా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేలా, ఒక పకడ్బందీ ఓటర్ల జాబితా తయారీకి ఎన్నికల సంఘానికి ప్రజలు పూర్తిగా సహకరించాలని కమిషనర్ మనస్ఫూర్తిగా విజ్ఞప్తి చేశారు.

# ఏపీలో జనాభా వృద్ధి కార్యక్రమం...

**అనంతపురం, జూలై 9, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది పిల్లలు ఉండి, కాన్పుల మధ్య కనీసం రెండేళ్ల విరామం పాటించిన దంపతులకు నగదు పురస్కారాలు అందించనున్నారు. ఈ విషయాన్ని ఏపీ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రకటించారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని జులై 11వ తేదీ నుంచి 18 వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ముగ్గురు పిల్లలున్న దంపతులను ప్రతి జిల్లాకు మూడు, అలాగే కాన్పుల మధ్య సరైన దూరం పాటించిన జంటలను ప్రతి జిల్లాకు ఆరు చొప్పున గుర్తించి రూ.5 వేల నగదు బహుమతి అందిస్తారు. ఒకవేళ అర్హులైన దంపతులు ఎక్కువగా ఉంటే లక్కీడిప్ ద్వారా విజేతలను ఎంపిక చేస్తామని, అలాగే ఉత్తమ సేవలందించిన డాక్టర్లు, వైద్య సిబ్బందికి కూడా పురస్కారాలు ఇస్తామని మంత్రి సత్యకుమార్ వెల్లడించారు.రాష్ట్ర ప్రభుత్వ ఈ నిర్ణయం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇటీవలి కాలంలో జనాభా పెరుగుదలపై

చేసిన వ్యాఖ్యలకు అనుగుణంగా ఉందని చెప్పవచ్చు. గతంలో జనాభా నియంత్రణకు ప్రాధాన్యత ఇచ్చిన చంద్రబాబు, ప్రస్తుత మారుతున్న పరిస్థితుల్లో తన వ్యూహాన్ని మార్చుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో యువత సంఖ్య తగ్గి, వృద్ధుల జనాభా వేగంగా పెరుగుతోందని (డెమోగ్రాఫిక్ డివిడెండ్ నష్టం) ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో రాష్ట్రం అధికంగా వృద్ధుల జనాభాగా మారకుండా ఉండాలంటే దక్షిణ భారతదేశంలోని దంపతులు ఎక్కువ మంది పిల్లల్ని కనాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు.జనాభా తగ్గుదల వల్ల కలిగే నష్టాలను నివారించడానికి చంద్రబాబు ఒక అడుగు ముందుకు వేసి చట్టపరమైన మార్పులకు

కూడా శ్రీకారం చుడుతున్నారు. గతంలో ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లలు ఉంటే స్థానిక సంస్థల (పంచాయతీ, మునిసిపల్) ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హులుగా ప్రకటించే నిబంధన ఉండేది. అయితే, జనాభా వృద్ధిని ప్రోత్సహించేందుకు ఈ ఇద్దరు పిల్లల పరిమితి నిబంధనను ఏపీ ప్రభుత్వం తొలగించింది. ఎక్కువ మంది పిల్లలు ఉన్నవారు కూడా ఎన్నికల్లో పోటీ చేసేలా చట్టాన్ని సవరించడమే కాకుండా, ఎక్కువ మంది పిల్లలున్న కుటుంబాలకు మరిన్ని ప్రోత్సాహకాలు అందించే దిశగా కూటమి ప్రభుత్వం యోచిస్తోంది.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## రెడ్ ఫ్లాగ్ తో వైసీపీ...

**విజయవాడ, జూలై 9, పెన్ పవర్:**
వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒక విషయంలో చాలా గర్వపడుతూ వస్తోంది. తాము ఒంటరిగా పోటీ చేసి అధికారంలోకి వచ్చామని గొప్పగా చెప్పుకుంటూ ఉంటుంది. కానీ మొన్నటి ఎన్నికల్లో ఓటమితో ఆ పార్టీకి అసలు సినిమా అర్థమయింది. వచ్చే ఎన్నికల్లో ఒంటరిగా వెళ్తే ఇబ్బందికరమని ఆ పార్టీ భావిస్తోంది. అలాగని ఆ పార్టీతో కలిసివచ్చే పార్టీలు లేవు. దానికి కారణం జగన్మోహన్ రెడ్డి స్వయంకృతాపం. అధికారంలో ఉన్నప్పుడు ఒక్క పార్టీతో కూడా చెలిమి లేదు. అసలు ఇతర రాజకీయ పార్టీలను లెక్క చేసేవారు కాదు. ఇప్పుడు అదే ఆ పార్టీకి మైనస్. ఆ పార్టీతో జత కలిసేందుకు ఏ పార్టీ ముందుకు రాని పరిస్థితి. అయితే ఇప్పుడు వామపక్షాల్లో ఒకటైన సిపిఐ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతో జత కలుస్తోంది. కానీ అది ప్రభుత్వంపై పోరాటం చేసే క్రమంలో. ప్రభుత్వ వైఫల్యాలపై విమర్శించే క్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని అనుసరిస్తోంది సిపిఐ. తాజాగా జోసెఫ్ రావణ్ అరెస్ట్ విషయంలో స్పందించారు సిపిఐ నారాయణ. ప్రభుత్వ చర్యలను తప్పుపడుతున్నారు. అందుకే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతో సిపిఐ జతకలుస్తుందన్న ప్రచారం జోరుగా సాగుతోంది.దేశవ్యాప్తంగా వామపక్షాలు ఉనికిని కోల్పోయాయి. చివరకు కేరళలో సైతం ఆ పార్టీ చేతులెత్తేసింది. కానీ ఇప్పటికీ ప్రజా సంఘాల రూపాల్లో వామపక్షాలు బలంగా ఉన్నాయి. అయితే వామపక్షాల అవసరం అధికార పార్టీలకంటే ప్రతిపక్షాలకి ఎక్కువగా ఉంటుంది. క్షేత్రస్థాయిలో ప్రజా పోరాటాలు చేయాలంటే వామపక్షాల అవసరం ఎక్కువగా ఉంటుంది. ఇంకా రెండున్నర సంవత్సరాలు మాత్రమే ఉండడంతో కచ్చితంగా ప్రజా పోరాటాలు చేయాల్సి ఉంటుంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. అందుకే వామపక్షాలను కలుపు కెళ్తే మంచి ప్రయోజనం ఉంటుందన్న టాక్ వినిపిస్తోంది. వచ్చే ఎన్నికల్లో పొత్తు పెట్టుకుని తక్కువ సీట్లు విడిచిపెట్టిన అది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి లాభం అని విశ్లేషకులు సైతం అభిప్రాయపడుతున్నారు.వచ్చే ఎన్నికల్లో ఆ మూడు పార్టీలు కూటమిగా ముందుకు వెళ్లడం ఖాయం. మరో 15 ఏళ్ల పాటు కలిసి ఉంటామని పవన్ కళ్యాణ్ తేల్చి చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒంటరి పోరాటం చేస్తే మాత్రం ఆ పార్టీకి ఇబ్బందికరమే. మొన్నటి ఎన్నికల వరకు ఒక ఎత్తు.. అంతకు ముందు పరిస్థితి వేరు.. మునుపటి మాదిరిగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దూకుడుగా వ్యవహరించలేదు. ఆపై చాలా వర్గాలు దూరమయ్యాయి. తనకున్న సంప్రదాయ ఓటు

బ్యాంకుకు తోడు వామపక్షాల బలం లభిస్తే మాత్రం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అనుకూల వాతావరణం ఉంటుంది. లేకుంటే కష్టం అన్న టాక్ ఉంది. ముఖ్యంగా సిపిఐ లాంటి పార్టీతో దూకుడుగా ముందుకు సాగితే కొన్ని జిల్లాల్లో ప్రభావం చూపవచ్చు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదానికి సంబంధించి మంత్రి నారా లోకేష్ ను నిలదీసింది సిపిఐ నేతలు. జగన్మోహన్ రెడ్డి పర్యటనలో సైతం సీపీఐ నేతలు కనిపించారు. అందుకే సిపిఐ తో వైసీపీ పొత్తు ఉంటుందన్న అనుమానం వ్యక్తం అవుతోంది. మరి జగన్ మనసులో ఏముందో తెలియాలి.

## టేకాఫ్ కు అంతా రెడీ...

**విజయనగరం 9, పెన్ పవర్:** ఉత్తరాంధ్ర ముఖచిత్రాన్ని మార్చేయబోతున్న ప్రతిష్టాత్మక 'భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం' ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధమైంది. విమానాశ్రయ నిర్మాణ పనులను కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు మంగళవారం క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు. విమానాశ్రయానికి సంబంధించిన ప్యాసింజర్ టెర్మినల్ బిల్డింగ్, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ టవర్, రన్‌వే మరియు ఎయిర్‌పోర్ట్ గ్రీనరీ పనులను ఆయన నిశితంగా వీక్షించారు.ఈ సందర్భంగా జీఎంఆర్ నిర్మాణ సంస్థ ప్రతినిధులు, ఉన్నతాధికారులు మంత్రికి ప్రాజెక్ట్ తుది మెరుగులకు సంబంధించిన పూర్తి వివరాలను మ్యాపుల ద్వారా వివరించారు. పనుల పరిశీలన అనంతరం నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ అత్యంత కీలకమైన అప్‌డేట్‌ను ఇచ్చారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు సంబంధించిన సివిల్ మరియు సాంకేతిక పనులు 100 శాతం పూర్తయ్యాయని, విమానాల రాకపోకలుప్రారంభించడానికి ఎయిర్‌పోర్ట్ పూర్తిగా సిద్ధంగా ఉందని జీఎంఆర్ సంస్థ స్పష్టం చేసిందని తెలిపారుఅన్నింటికీ మించి, అత్యంత కీలకమైన విమానాశ్రయ నిర్వహణ లైసెన్స్ కూడా మంజూరైందని మంత్రి అధికారికంగా ప్రకటించారు. "భోగాపురంలో ఇంత అత్యద్భుతమైన విమానాశ్రయ భవనం వస్తుందని అసలు ఊహించలేదు" అని మంత్రి రామ్మోహన్ నాయుడు సంతోషం వ్యక్తం చేశారు. సముద్ర తీర ప్రాంత సంస్కృతిని ప్రతిబింబించేలా ఈ విమానాశ్రయ టెర్మినల్‌ను 'చేప ఆకారంలో' ఎంతో ఆకర్షణీయంగా నిర్మించామని ఆయన వెల్లడించారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక ఆదేశాలు, కూటమి ప్రభుత్వ పక్కా ఎజెండా, మరియు అందరి సహకారంతో కేవలం రెండేళ్ల రికార్డు కాలంలోనే ఈ మెగా ప్రాజెక్ట్‌ను పూర్తి చేయగలిగామని స్పష్టం చేశారు. ఈ నిర్మాణానికి భూములిచ్చి పూర్తి సహకారం అందించిన స్థానిక రైతులు, ప్రజలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవ తేదీపై మంత్రి క్లారిటీ ఇచ్చారు. విమానాశ్రయం అన్ని రకాలుగా సిద్ధమైనందున, ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కోరనున్నట్లు చెప్పారు. ప్రధాని మోదీ తన పర్యటన తేదీని ఖరారు చేయగానే భోగాపురం ఎయిర్‌పోర్టును అధికారికంగా లాంఛనంగా ప్రారంభిస్తామని వెల్లడించారు. రానున్న రోజుల్లో పెరగబోయే ప్రయాణికుల రద్దీ, ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకుని ఎయిర్‌పోర్ట్ లోపల మరియు వెలుపల అన్ని రకాల అధునాతన ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.

# వైసీపీలో రావణ మంటలు



**తిరుపతి, గుంటూరు 9, పెన్ పవర్:**
వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో విభేదాల పర్వం తారాస్థాయికి చేరినట్లు తెలుస్తోంది. ఆ పార్టీలో ఆలోచించి నాయకులు వర్సెస్ దూకుడు కలిగిన నాయకులు అన్నట్టు పరిస్థితి మారింది. ఏపీలో జోసెఫ్ రావణ్ అరెస్ట్ ప్రకంపనలు సృష్టిస్తున్న సంగతి తెలిసిందే. ఆయనకు వైసిపి మద్దతుగా నిలిచింది. న్యాయ పోరాటానికి సహాయం అందించింది. మాజీ మంత్రి అంబటి రాంబాబు అయితే చేస్తే తప్పు ఏంటి అని ప్రశ్నించారు. మేము ఉన్నది అందుకే కదా అన్నట్టు మాట్లాడారు.. అయితే తాజాగా మాజీ మంత్రి, సీనియర్ నాయకుడు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అందుకు విరుద్ధంగా ప్రకటన చేశారు. జోసెఫ్ రావణ్ కు తమ పార్టీతో అసలు సంబంధం లేదని తేల్చేశారు. అంతర్గతంగా వైసీపీలో పార్టీకి డ్యామేజ్ జరుగుతుందన్న కోణంలోనే పెద్దిరెడ్డి ప్రకటన అని తెలుస్తోంది.ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తో పాటు కూటమి ప్రభుత్వంపై యూట్యూబ్ వేదికగా నిత్య విమర్శలు చేస్తూ వస్తున్నారు జోసెఫ్ రావణ్. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ లైన్లో పనిచేస్తున్నట్లు ఆరోపణలు కూడా ఉన్నాయి. తాజాగా ఆయన అరెస్టుతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ స్పందించిన తీరుతో కూడా ఈ అనుమానాలు బలపడ్డాయి. హిందూ దేవుళ్ళతో పాటు దేవతలపై ఆయన అనుచిత వ్యాఖ్యలు చేశారు. అవి తీవ్ర ప్రతికూలత చూపాయి. ఇటువంటి పరిస్థితుల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మీడియాతో మాట్లాడారు. రావణ్ అనే వ్యక్తి తమ పార్టీకి చెందిన వాడు కాదని.. తాము అతడిని ఎక్కడినుంచో తీసుకువచ్చి.. కూటమి ప్రభుత్వంపై మాట్లాడించలేదని డిఫెన్స్ మోడ్ లోకి వెళ్లారు. సదరు వ్యక్తి కేవలం పవన్ కళ్యాణ్ ను.. ఆయన విధానాలను మాత్రమే ప్రశ్నించాడని.. దానికి తమకు ముడి పెట్టడం సరికాదని చెప్పుకొచ్చారు. అయితే నిన్నటి వరకు తమ అనుకూల సోషల్ మీడియా నెట్వర్క్ లో.. రావణ్ వీడియోలను విపరీతంగా షేర్ చేస్తూ.. ఓ రేంజ్ లో ఓనర్ షిప్ తీసుకుంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. ఇప్పుడు ఒక్కసారిగా ప్లేట్ ఫిరాయించడంతో అసలు సీన్ అర్థం అవుతోంది.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యూటర్న్ తీసుకోవడానికి అనేక కారణాలు ఉన్నాయి. ఆయన పాత వీడియోలు వెలుగులోకి వచ్చాయి. రావణ్ గతంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ పై అత్యంత ఘోరమైన, వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఏకంగా దేశ సార్వభౌమత్యాన్ని, దేశానికి వ్యతిరేకంగా మాట్లాడిన వీడియోలు వైరల్ అయ్యాయి. అటువంటి వ్యక్తిని నెత్తిన పెట్టుకుంటే బిజెపికి కోపం వస్తుందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ భయపడుతోంది. అందుకే దానిని వదిలించుకునే పనిలో పడింది. జోసెఫ్ రావణ్ కు మద్దతు తెలిపితే తప్పు ఏంటి అని అంబటి రాంబాబు ప్రశ్నించగా.. ఇప్పుడు అసలు తమకు ఆయనతో సంబంధం లేదని తేల్చేశారు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి.. దీనిపై పార్టీలో చర్చ నడుస్తోంది. దూకుడు గల నేతలను నియంత్రించకపోతే పార్టీకి నష్టమన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. మరి జగన్ మోహన్ రెడ్డి ఎలా స్పందిస్తారో చూడాలి.

మరోవైపు తాజాగా జోసెఫ్ రావణ్ కు చెందిన సెల్ఫోన్లో అశ్లీల వీడియోలు వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. ఈనెల ఒకటి నాయన అరెస్ట్ అయ్యారు. ఆ సమయంలో ఫోన్ చేస్తాను విశ్లేషించిన పోలీసులు అందులో కీలక సమాచారం ఉన్నట్లు తెలుసుకున్నారు. అయితే అప్పటికే రావని తెలివిగా తన ఫోన్లోని వీడియోలను డిలీట్ చేసినట్లు తెలుస్తోంది. అలా డిలీట్ చేసిన డేటా కోసం ఫోన్ ను ఫోరెన్సిక్ ల్యాబ్ కు పంపించారు. ఆ ల్యాబ్ నుంచి వచ్చిన నివేదిక షాకింగ్ అనిపిస్తోంది. అమాయక యువతులను టార్గెట్ గా చేసుకుని వారితో అసభ్యకరంగా ప్రవర్తించడం.. ఏకాంతంగా ఉన్న సమయంలో ఫోటోలు, వీడియోలు తీసి బ్లాక్మెయిల్ చేసినట్లు సమాచారం. ఈ కేసులో ఇప్పుడు మరో కోణం దొరికింది పోలీసులకు. రావణ్ బారిన పడిన బాధితులు ఎంతమంది ఉన్నారన్న కోణంలో అధికారులు దర్యాప్తు చేశారు. డేటా ఆధారంగా పదిమంది బాధితులను గుర్తించినట్లు తెలుస్తోంది. దీంతో మరింత కఠినమైన కేసులు జోసెఫ్ రావణ్ పై మోపే అవకాశం ఉంది.ఇప్పటికే కఠినమైన చట్టం కింద కేసు నమోదు చేశారు. మావోయిస్టు భావజాలాన్ని వ్యాప్తి చేసేలా, సాయుధ తిరుగుబాటును ప్రోత్సహించేలా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదుతో రావణ్ పై పోలీసులు కేసు నమోదు చేశారు. దేశ సార్వభౌమాధికారం, ఐక్యత, సమగ్రతకు భంగం కలిగిస్తూ దేశద్రోహానికి పాల్పడ్డారంటూ పలు సెక్షన్ల కింద, చట్ట విరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం ( ఉపా ) సెక్షన్ల కింద అభియోగాలు మోస్తారు. కోర్టులో హాజరు పరచగా ఈనెల 18 వరకు రిమాండ్ విధించారు. అయితే ఇప్పుడు కొత్తగా అమాయక యువతులను టార్గెట్ చేసి.. అశ్లీలంగా ప్రవర్తించారన్న ఆరోపణలపై అదనపు సెక్షన్లు నమోదు చేసే ఛాన్స్ కనిపిస్తోంది.

# ఏపీలో మాటల మంటలు

**విజయవాడ, జూలై 9, పెన్ పవర్: )**
ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక ఎన్నికల్లో లభించిన చారిత్రాత్మక విజయంతో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన తరుణంలో.. రాష్ట్ర రాజకీయాలు మునుపెన్నడూ లేనంతగా వ్యక్తిగత దూషణలు, శాంతిభద్రతల సవాళ్ల చుట్టూ తిరుగుతున్నాయి. రాష్ట్రంలో ఉద్దేశపూర్వకంగానే ఉద్రిక్తతలు రగిల్చేందుకు, శాంతిభద్రతల సమస్యలను సృష్టించేందుకు ఒక పక్కా వ్యూహం ప్రకారం ప్రయత్నాలు జరుగుతున్నాయనే అనుమానాలు టీడీపీ వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి. రాయలసీమలోని రాప్తాడు ఫ్యాక్షన్ సెగల నుంచి కోస్తాలోని పెనుమలూరు పొలిటికల్ వార్ దాకా.. గత కొన్ని వారాలుగా చోటుచేసుకుంటున్న పరిణామాలు కేవలం స్థానిక వివాదాలు కాదని, కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో అభద్రతా భావాన్ని సృష్టించేందుకు ఒక పెద్ద పొలిటికల్ మైండ్ గేమ్ ఆడుతున్నారని అంటున్నారు. రాయలసీమ సున్నిత ప్రాంతాల్లో పాత కక్షలను మళ్లీ రగల్చడం. ఎన్నికల ఓటమి తర్వాత దాదాపు రెండేళ్ల పాటు అజ్ఞాతంలోకి వెళ్లిన రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి హఠాత్తుగా తెరపైకి వచ్చి.. దివంగత నేత పరిటాల రవి, ప్రస్తుత మంత్రి పరిటాల సునీతలపై అత్యంత ఘోరమైన, వ్యక్తిగత పదజాలం ఉపయోగించడం జిల్లాలో సంచలనంగా మారింది. ఫ్యాక్షన్ చరిత్ర ఉన్న అనంతపురం లాంటి జిల్లాలో ఇలాంటి ఉద్రేకం రేపే ప్రసంగాలు చేయడం వెనుక.. ఎలాగైనా స్థానిక కేడర్‌ను ఘర్షణల్లోకి నెట్టాలనే కుట్ర దాగుందని అనుమానిస్తున్నారు. కూటమి శ్రేణులు గనుక సహనం కోల్పోయి ఎదురుదాడి చేస్తే.. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేదు, మాపై దాడులు జరుగుతున్నాయి అని ఢిల్లీ స్థాయిలో విక్టిమ్ కార్డ్ ప్లే చేసే వ్యూహంతోనే తోపుదుర్తి ఇలా రెచ్చగొడుతున్నారని అధికార పార్టీ వర్గాలు అనుమానిస్తున్నాయి. కృష్ణా జిల్లా కానూరు లో టీడీపీ జెండా దిమ్మెను ఉద్దేశపూర్వకంగా తొలగించిన వ్యవహారం దుమారం రేపింది. అమరావతిలోనూ వైసీపీ నేతల పర్యటనలో ఉద్రిక్తత ఏర్పడింది. తమ నేతలపైనే దాడులు జరిగాయంటూ మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్వయంగా రంగంలోకి రావడం ఈ పొలిటికల్ స్కెచ్‌లో భాగమేనని అంటున్నారు. ఏపీ రాజకీయాలతో ఏమాత్రం సంబంధం లేని ఇతర రాష్ట్రాల యూట్యూబర్లు, సోషల్ మీడియా యాక్టివిస్టులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లను టార్గెట్ చేస్తూ మహిళా నేతలపై అత్యంత జుగుప్సాకరమైన పోస్టులు పెట్టడం, విద్వేషాలను రేపడం పతాక స్థాయికి చేరింది. తాజాగా, దళిత క్రైస్తవ మీటింగుల ముసుగులో పవన్ కళ్యాణ్‌పై, రాజ్యాంగ వ్యవస్థలపై సాయుధ తిరుగుబాటును, నక్సల్స్ ఐడియాలజీని ప్రోత్సహిస్తూ వీడియోలు చేసిన వివాదాస్పద యూట్యూబర్ జోసెఫ్ అలియాస్ ప్రశ్న రావణ్ పై గన్నవరం పోలీసులు కఠినమైన ఉపా చట్టం కింద కేసు నమోదు చేసి నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించడం సంచలనంగా మారింది. ఈ అలజడి రాజకీయ వ్యూహాన్ని తిప్పికొట్టేందుకు కూటమి ప్రభుత్వం అత్యంత కఠినమైన యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసే సూచనలు కనిపిస్తున్నాయి. గత రెండేళు_గా కేవలం పరిపాలన, సంక్షేమంపైనే దృష్టి పెట్టి శాంతిభద్రతల విషయంలో కొంత ఉదారంగా వ్యవహరించడం వల్లే ఇలాంటి కుట్రలు జరుగుతున్నాయని భావిస్తున్న సీఎం చంద్రబాబు.. ఇప్పుడు హోం శాఖకు ఫ్రీ హ్యాండ్ ఇచ్చినట్లుగా తెలుస్తోంది. రాజకీయ

నాయకుల ముసుగులో ఉన్నా సరే.. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి హయాంలో జరిగిన రాక్రీట్ అవినీతి అక్రమాలపై, ఆస్తుల సీజింగ్‌పై లీగల్ ఫోకస్ పెట్టడంతో పాటు.. సోషల్ మీడియా విద్వేషకులకు మద్దతుగా నిలుస్తున్న నటుడు ప్రకాశ్ రాజ్, వైసీపీ సోషల్ మీడియా వింగ్‌పై లీగల్ నోటీసులు, అరెస్టుల పరంపర ప్రారంభం కానుందని భావిస్తున్నారు.

ఏపీ రాజకీయాలు ఇప్పుడు కేవలం అభివృద్ధి-సంక్షేమం అనే చర్చల నుంచి మారి, వ్యవస్థల పరిరక్షణ-శాంతిభద్రతల అదుపు అనే దిశగా సాగుతున్నాయి. ప్రతిపక్షం ఎంతలా రెచ్చగొట్టినా.. కూటమి ప్రభుత్వం చట్టపరమైన ఆంక్షలు, ఉపా లాంటి కఠిన నిబంధనల ద్వారా అరాచకాలను అణచివేసేందుకే మొగ్గు చూపుతోంది. రాబోయే రోజుల్లో ప్రభుత్వం తీసుకోబోయే ఈ కఠిన చర్యలు అరాచక శక్తులకు అడ్డుకట్ట వేసి రాష్ట్రాన్ని ప్రశాంత మార్గంలో ఉంచుతాయా.. లేక ప్రతిపక్షం మరింతగా సెంటిమెంట్ పాలిటిక్స్ తెరపైకి తెస్తుందా అనేది వేచి చూడాలి

# టాస్ విన్ రేట్ 100%.. మ్యాచ్ రిజల్ట్ 0%.. తొలి గెలుపు కోసం శ్రేయస్ వెయిటింగ్!



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఇండియన్ క్రికెట్ చరిత్రలోనే ఎవరికీ సాధ్యం కాని ఒక విచిత్రమైన రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. టీ20 ఇంటర్నేషనల్స్‌లో కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు జరిగిన 5 మ్యాచ్‌ల్లోనూ అతను టాస్ గెలిచాడు. దీంతో టాస్ గెలుపులో 100 శాతం సక్సెస్ రేట్‌తో దూసుకుపోతున్నాడు. కానీ, దీని వెనుకే ఒక చేదు నిజం కూడా ఉంది. టాస్ గెలిచిన అన్ని మ్యాచ్‌ల్లోనూ (100% టాస్ విన్ రేట్) ఓడిపోయి, జీరో (0%) మ్యాచ్ విన్ రేట్ కలిగిన ఏకైక టీమిండియా కెప్టెన్‌గా కూడా శ్రేయస్ నిలిచాడు. ఐర్లాండ్ చేతిలో చారిత్రాత్మక సిరీస్ ఓటమితో సహా, కెప్టెన్‌గా ఆడిన గత 5 మ్యాచ్‌ల్లోనూ ఇండియా ఓడింది.

(గురువారం) బ్రిస్టల్ మైదానంలో ఇంగ్లాండ్‌తో జరగనున్న 4వ టీ20 మ్యాచ్ శ్రేయస్ అయ్యర్‌కు అత్యంత కీలకంగా మారింది. ఈ మ్యాచ్‌లో కూడా టాస్ గెలిస్తే, వరుసగా 6 మ్యాచుల్లో టాస్‌లు గెలిచిన మహేంద్ర సింగ్ ధోనీ, విరాట్ కోహ్లీల ఆల్‌టైమ్ రికార్డును శ్రేయస్ సమం చేస్తాడు.

**ఎక్కువ టాస్‌లు గెలిచిన భారత టీ20 కెప్టెన్లు:**

6 – ఎంఎస్ ధోనీ (మే 2010 – ఫిబ్రవరి 2012)
6 – విరాట్ కోహ్లీ (ఆగస్ట్ 2019 – డిసెంబర్ 2019)
5 – రోహిత్ శర్మ (ఫిబ్రవరి 2020 – ఫిబ్రవరి 2022)
5 – ఎంఎస్ ధోనీ (సెప్టెంబర్ 2007)
5 – శ్రేయస్ అయ్యర్ (జూన్ 2026 – జూలై 2026)

**సిరీస్ ఓటమిని తప్పించుకోవాలనే కసిలో భారత్:**

ఐర్లాండ్ చేతిలో చరిత్రలోనే మొదటిసారి సిరీస్ ఓడిపోయిన భారత్..

ఇప్పుడు ఇంగ్లాండ్ చేతిలో కూడా మరో సిరీస్ పరాభవాన్ని మూటగట్టుకోకుండా ఉండాలంటే ఈ 4వ టీ20లో తప్పకుండా గెలవాల్సి ఉంది. ఈ మ్యాచ్ ద్వారా శ్రేయస్ అయ్యర్ కెప్టెన్‌గా తన మొదటి విజయాన్ని ఖాతాలో వేసుకోవాలని పట్టుదలతో ఉన్నాడు.

**ఇరు జట్ల స్క్వాడ్స్:**

**భారత జట్టు:** అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), సంజు శాంసన్, శివమ్ దూబే, అక్షర్ పటేల్, హర్షిత్ రాణా, ప్రిన్స్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, వాషింగ్టన్ సుందర్

**ఇంగ్లాండ్ జట్టు:** ఫిలిప్ సాల్ట్, జోస్ బట్లర్ (వికెట్ కీపర్), హ్యారీ బ్రూక్ (కెప్టెన్), జాకబ్ బెథెల్, టామ్ బాంటన్, సామ్ కరన్, విల్ జాక్స్, జోఫ్రా ఆర్చర్, లియామ్ డాసన్, ఆదిల్ రషీద్, జోష్ టంగ్

# రంగారెడ్డి ఔట్.. క్వాలిఫయర్-2 టికెట్ కన్ఫర్మ్ చేసుకున్న కరీంనగర్ డైమండ్స్





**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ ప్రీమియర్ (టిజీ20) లీగ్-2026లో భాగంగా ఉప్పల్ వేదికగా రంగారెడ్డి రైజర్స్ తో జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో కరీంనగర్ డైమండ్స్ జట్టు 75 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయంతో కరీంనగర్ జట్టు క్వాలిఫైయర్-2కి అర్హత సాధించింది. ఇక టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ తీసుకున్న కరీంనగర్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో కేవలం 5 వికెట్ల నష్టానికి 238 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది. కరీంనగర్ కెప్టెన్ తన్మయ్ అగర్వాల్ భారీ సెంచరీతో జట్టును ముందుకు నడిపించాడు. అతడు కేవలం 61 బంతుల్లోనే 11 ఫోర్లు, 10 సిక్సర్లతో 137 రన్స్ చేశాడు. ఈ టీజీ20 లీగ్‌లో తన్మయ్‌కి ఇది మూడో సెంచరీ కావడం విశేషం.

**రాణించిన సింహా.. రంగారెడ్డి బౌలింగ్ విఫలం:**

తన్మయ్‌తో పాటు వైస్ కెప్టెన్ సింహా హాఫ్ సెంచరీ (50 పరుగులు)తో రాణించాడు. వీరిద్దరూ కలిసి రెండో వికెట్‌కు కేవలం 69 బంతుల్లోనే 139 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. కాగా రంగారెడ్డి బౌలర్లలో అర్బజ్ కరీముద్దీన్ రెండు వికెట్లు పడగొట్టగా.. అరుణ్ కుమార్, కెప్టెన్ వినయ్ త్యాగరాజన్, సుకేత్, నితిన్ సాయి యాదవ్ తలో ఒక వికెట్ తీసుకున్నారు.

**చేతులెత్తేసిన రంగారెడ్డి బ్యాటర్లు:**

239 పరుగుల భారీ లక్ష్య ఛేదన కోసం బరిలోకి దిగిన రంగారెడ్డి రైజర్స్ జట్టు కేవలం 16.3 ఓవర్లలో 163 పరుగులకే కుప్పకూలింది. అయితే కరీంనగర్ స్పిన్నర్ అమిత్ శర్మ తన అద్భుత బౌలింగ్‌తో రంగారెడ్డి బ్యాటింగ్ ఆర్డర్‌ను దెబ్బకొట్టాడు. అతను 3.3 ఓవర్లలో కేవలం 16 రన్స్ మాత్రమే ఇచ్చి 5 వికెట్లు తీసుకుని కరీంనగర్‌కు విజయాన్ని అందించాడు. అమిత్‌తో పాటు రూపేష్ వర్మ కూడా 2 వికెట్లు సొంతం చేసుకున్నాడు.

అయితే రంగారెడ్డి రైజర్స్ జట్టు బ్యాటర్లలో కెప్టెన్ వినయ్ త్యాగరాజన్ (33 బంతుల్లో 63), నితిన్ సాయి యాదవ్ (50) హాఫ్ సెంచరీలతో ఒంటరి పోరాటం చేసినప్పటికీ జట్టును మాత్రం గెలిపించలేకపోయారు. మిగిలిన బ్యాటర్లు ఎవరూ పెద్దగా రాణించకపోవడంతో రంగారెడ్డికి ఈ ఘోర ఓటమి తప్పలేదు. ఈ పరాజయంతో రంగారెడ్డి ఇంటికి వెళ్లిపోయింది.

## 2027 వరల్డ్ కప్ కోసం పాక్ ప్రిపరేషన్ షురూ.. కొత్త టోర్నీతో బిగ్ ప్లాన్!






**హైదరాబాద్ పెన్ పవర్:** వరుస పరాజయాలతో సతమతమవుతున్న పాకిస్తాన్ క్రికెట్ బోర్డు వచ్చే ఏడాది సౌతాఫ్రికా వేదికగా జరగబోయే 2027 వన్డే ప్రపంచకప్ కోసం ఇప్పటి నుంచే మైండ్ గేమ్ షురూ చేసింది. ఎలాగైనా ఒక పటిష్టమైన పాక్ జట్టును రెడీ చేసేందుకు, వచ్చే ఏడాది ఆగస్టులో సరికొత్త డొమెస్టిక్ టోర్నమెంట్‌కు శ్రీకారం చుట్టబోతోంది. దేశవాళీ ఫస్ట్ క్లాస్ సీజన్ కంటే ముందే ఈ 50 ఓవర్ల టోర్నీ జరగనుందని ఈ టోర్నీలో నాలుగు జట్లు తలపడనున్నాయి. వరల్డ్ కప్‌కు ఇంకా కేవలం 18 నెలల సమయం మాత్రమే ఉంది, కాబట్టి ప్రిపరేషన్స్ మొదలు పెట్టడానికి ఇదే రైట్ టైమ్ అని ఆకిబ్ జావేద్ తెలిపారు. పాక్ వైట్-బాల్ ప్లేయర్లు అందరూ ఇందులో ఆడటం కంపల్సరీ. సెలెక్టర్లు, కోచ్‌లు కలిసి ప్రతి ప్లేయర్‌కు ఒక నిర్దిష్టమైన రోల్ ఇచ్చి మరీ మైదానంలోకి దించనున్నారని పేర్కొన్నాడు.

**టాప్-4లో లేకపోతే ఒప్పుకునే ప్రసక్తి లేదు:**

పాకిస్తాన్‌లోని ప్రైమ్ అండ్ రైజింగ్ స్టార్స్ ఆడే ఈ టోర్నీని ఫ్యాన్స్ కోసం లైవ్ బ్రాడ్‌కాస్ట్ చేయనున్నారు. ఈ టోర్నమెంట్ ద్వారా వరల్డ్ కప్‌కు కిరాక్ ప్లేయర్లు దొరుకుతారని పీసీబీ మేనేజ్‌మెంట్ నమ్ముతోంది. ప్రపంచ వన్డే ర్యాంకింగ్స్‌లో పాక్ టీమ్ ఖచ్చితంగా టాప్-4 లో ఉండాలని, అంతకంటే తక్కువ వస్తే అస్సలు ఒప్పుకునేది లేదని ఆకిబ్ జావేద్ టార్గెట్ సెట్ చేశారు.

**ఈసారి సెమీస్ బెర్తు టార్గెట్:**

పాకిస్తాన్ జట్టు గత 3 వన్డే ప్రపంచకప్‌లలో కనీసం సెమీఫైనల్‌కు కూడా క్వాలిఫై అవ్వలేదు.. పైగా ఇటీవలి టీ20 వరల్డ్ కప్‌లలో కూడా ఘోరంగా విఫలమవడంతో పాటు ప్రస్తుతం వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (ఔజ) పాయింట్ల పట్టికలోనూ చివరి స్థానంలో నిలిచింది. పరువు కాపాడుకోవడానికైనా ఒక స్థిరమైన వన్డే జట్టును తయారు చేసుకోవాలని దాయాది దేశం ఆశిస్తోంది. అక్టోబర్ 4 నుంచి నవంబర్ 21 మధ్య జరిగే వరల్డ్ కప్‌కు ముందే ఈ టోర్నీ ముగియనుంది.

# బాలీవుడ్ కంటే టాలీవుడ్‌కే సోనాలి బింద్రే ఫుల్ మార్క్స్

సాంప్రదాయక ఎత్నిక్ గ్లామర్‌కు నిలువుటద్దంలా నిలిచిన జాన్వీ కపూర్



బాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా ఒక వెలుగు వెలిగినప్పటికీ, టాలీవుడ్ గురించి మాట్లాడాల్సి వస్తే తన అభిప్రాయం ఏమాత్రం దాచుకోనని నటి సోనాలి బింద్రే స్పష్టం చేశారు. రెండు పరిశ్రమల్లో పనిచేసిన అనుభవంతో ఆమె చేసిన తాజా కామెంట్స్ ఇప్పుడు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా టాలీవుడ్ పనితీరు, ప్లానింగ్, ప్రొడక్షన్ వాల్యూస్ పై ఆమె వ్యక్తం చేసిన అభిప్రాయాలు టాలీవుడ్ కు మరోసారి ప్రశంసలు తీసుకొచ్చాయి.



టాలీవుడ్ లో పని చేసే విధానం చాలా క్రమబద్ధంగా ఉంటుందని, సినిమా ప్రారంభానికి ముందే కథ, స్క్రీన్‌ప్లే, షూటింగ్ ప్లాన్ వంటి అంశాలు క్లియర్ గా రెడీగా ఉండటం వల్ల షూటింగ్‌లు అనుకున్న టైమ్‌కే పూర్తవుతాయని ఆమె పేర్కొన్నారు. ప్రతి విభాగం సమన్వయంతో పనిచేయడం వల్ల సెట్స్‌పై గందరగోళం తక్కువగా ఉంటుందని ఆమె అభిప్రాయపడ్డారు. అదే సమయంలో బాలీవుడ్ లో కొన్ని సందర్భాల్లో కథ లేదా సన్నివేశాల్లో చివరి నిమిషంలో మార్పులు చోటుచేసుకోవడం సాధారణమని, దీంతో షూటింగ్ షెడ్యూల్స్‌పై ప్రభావం పడుతుందని ఆమె వివరించారు. టాలీవుడ్‌లో మాత్రం ముందస్తు ప్రణాళికకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం నిర్మాతలు, డైరెక్టర్లు, నటీనటులందరికీ సౌకర్యంగా ఉంటుందని చెప్పారు.ప్రొడక్షన్ వాల్యూస్ విషయంలో కూడా తెలుగు సినిమాలు గత కొన్నేళ్లుగా భారీ స్థాయిలో అభివృద్ధి సాధించాయని సోనాలి అభిప్రాయపడ్డారు. కథకు తగ్గట్టుగా ఖర్చు పెట్టడంలో నిర్మాతలు వెనుకాడరని, టెక్నికల్ వాల్యూస్ కూడా అంతర్జాతీయ స్థాయికి చేరుకున్నాయని ఆమె పేర్కొన్నారు. సెట్స్‌లో కళాకారులు, టెక్నీషియన్ల పట్ల చూపించే గౌరవం, ఆతిథ్యం కూడా టాలీవుడ్ ప్రత్యేకతల్లో ఒకటిగా ఆమె చెప్పారు.తెలుగు ప్రేక్షకులతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్న సోనాలి, తాను నటించిన సినిమాలే ఇప్పటికీ తనను తెలుగు అభిమానులకు దగ్గరగా ఉంచాయని అన్నారు. కెరీర్‌లో చేసిన క్యారెక్టర్ల ద్వారా లభించిన ఆదరణను ఎప్పటికీ మర్చిపోలేనని ఆమె పేర్కొన్నారు. గ్లామర్‌కే పరిమితం కాకుండా యాక్టింగ్ కు అవకాశం ఉన్న క్యారెక్టర్లు కూడా తెలుగు సినిమాల్లో దక్కడం తనకు ప్రత్యేక అనుభూతినిచ్చిందని తెలిపారు.పర్సనల్ లైఫ్ లో క్యాన్సర్‌తో పోరాడి సక్సెస్‌ఫుల్‌గా కోలుకున్న తర్వాత, ఇప్పుడు ఎంపిక చేసిన పాత్రలతోనే ప్రేక్షకుల ముందుకు వస్తున్న సోనాలి బింద్రే, మంచి కథ, బలమైన పాత్ర దొరికితే మరోసారి తెలుగు సినిమాలో నటించేందుకు సిద్ధమేనని సంకేతాలిచ్చారు. ఆమె కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, టాలీవుడ్ అభిమానులు ఆమె రీఎంట్రీ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

అద్భుతమైన రోజ్-పింక్ లేస్ చీరలో రిద్ధి కుమార్ అపురూపమైన హుందాతనం



Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At published at D.No:10-11G-60/1, Flat No.4, Keelapatla Road Cross, Bangalore ByPass Road,Gangavaram MDL,Palamaneru Chittoor Dist, Editor Gantyada Apparao. PRGI Registration No. " APTEL/25/A4274 " e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965